జాతీయ తెలుగు దినపత్రిక

RNI - TGTEL/25/A0348

# సందేశం టైమ్స్

నిజం దాగదు - వార్త ఆగదు

PUBLISHED: TG & AP | సంపుటి : 1 | సంచిక: 87 | గురువారం 21 ఆగస్టు - 2025 | పేజీలు : 8 | వెల 2 /-

Published from : Adilabad, Bhadradri Kothagudem, Hanumakonda, Hyderabad, Jagtial, Jangaon, Jayashankar Bhupalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahbubnagar, Mancherial, Medak, Medchal-Malkajgiri, Mulugu, Nagarkurnool, Nalgonda, Narayanpet, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla, Ranga Reddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal, and Yadadri Bhuvanagiri.

తెలుగు పత్రికా రంగంలో నూతనంగా అడుగుపెట్టి విశేష ప్రజాదరణతో ముందుకు సాగుతున్న మన 'సందేశం టైమ్స్' తెలుగు దిన పత్రికలో పని చేయుటకు రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయి స్టాఫ్ రిపోర్టర్స్ కావలెను. అలానే మండల స్థాయి రిపోర్టర్స్ కావలెను.కొత్త వారికీ అవకాశం కలదు


ఎడిటర్ : 90520 45435

## ఉప రాష్ట్రపతి పదవికి ఎన్డీయే అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్ నామినేషన్



న్యూఢిల్లీ:ఆగష్టు 20(సందేశం టైమ్స్) : ఎన్డీయే ఉప రాష్ట్రపతి అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్ బుధవారంనాడు తన నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రులు అమిత్‌షా, రాజ్‌నాథ్ సింగ్, నితిన్ గడ్కరి, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా సహా పలువురు మంత్రుల సమక్షంలో రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలను రాధాకృష్ణన్ సమర్పించారు.నామినేషన్ ప్రక్రియలో భాగంగా నాలుగు సెట్ల పేపర్లు దాఖలు చేశారు. తొలి సెట్‌కు చీఫ్ ప్రపోజర్‌గా ప్రధాని ఉన్నారు. నామినేషన్ పత్రాల దాఖలుకు ముందు సీపీ రాధాకృష్ణన్ ప్రేరణా స్థల్ వద్ద మహాత్మాగాంధీ విగ్రహానికి నివాళులర్పించారు. నామినేషన్ పత్రాల దాఖలు అనంతరం సీపీ రాధాకృష్ణన్ విజయంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ధీమా వ్యక్తం చేసారు. నామినేషన్ పత్రాల దాఖలుకు మంత్రులు, ఎన్డీయే నేతలతో కలిసి వెళ్లామని, ఉపరాష్ట్రపతి పదవికి రాధాకృష్ణన్ వన్నెతెస్తారని, దేశం మరింత ప్రగతి పథంలోకి వెళ్తుందని ప్రధాని ఆశాభావం వ్యక్తం చేశారు. సెప్టెంబర్ 9న ఉప రాష్ట్రపతి ఎన్నికల జరగనుండగా, విపక్ష 'ఇండియా' కూటమి ఇప్పటికే తమ అభ్యర్థిని ప్రకటించింది. దీంతో ఎన్నిక అనివార్యమైంది. ప్రతిపక్షాల ఉమ్మడి అభ్యర్థిగా మాజీ న్యాయమూర్తి బి.సుదర్శన్ రెడ్డిని విపక్ష కూటమి ఎంపిక చేసింది.

## రాజ్యాంగ పట్ల అవగాహన ఉన్నవారే ఉపరాష్ట్రపతిగా ఉండాలి



ఢిల్లీ,ఆగష్టు 20(సందేశం టైమ్స్) : ఉపరాష్ట్రపతి పదవి అధికారం కాదు.. అది గౌరవ ప్రదమైన రాజ్యాంగ పదవి అని ఇండియా కూటమి ఉపరాష్ట్రపతి అభ్యర్థి జస్టిస్ బి.సుదర్శన్ రెడ్డి ఉద్ఘాటించారు. ఉపరాష్ట్రపతి పదవికి తాను సరైన వాడినని...అర్హులైన వారిని నిర్ణయించుకొని ఓటేయాలని ఎంపీలను కోరారు. ఇవాళ(బుధవారం) ఏబీఎన్ ఆంధ్రజ్యోతితో సుదర్శన్ రెడ్డి మాట్లాడారు. రాజ్యాంగాన్ని అమలు చేయాల్సిన స్థానమే ఉపరాష్ట్రపతి పదవి అని నొక్కిచెప్పారు. దాదాపు 55 ఏళ్లు రాజ్యాంగంతో సుదీర్ఘమైన ప్రస్తానం చేసిన తనకన్నా ఈ పదవికి అర్హులైన వారెవరు ఉంటారని ప్రశ్నించారు సుదర్శన్ రెడ్డి.రాజ్యాంగాన్ని అన్వయించడం, అనునిత్యం నిత్య విద్యార్థిగా ఔపాసన పట్టిన వాడినని...దానికి కొనసాగింపే ఉపరాష్ట్రపతి పదవి...అందుకే ఈ పదవికి పోటీ చేయడానికి అంగీకరించానని సుదర్శన్ రెడ్డి తెలిపారు. రాజ్యాంగం పట్ల అవగాహన గల వ్యక్తి కావాలనుకొని తనను ఇండియా కూటమి అభ్యర్థిగా నిలబెట్టాలని భావించారని పేర్కొన్నారు. ఉపరాష్ట్రపతి పదవి అత్యున్నత రాజ్యాంగ పదవి అని ఎన్నుకోవాల్సింది ఎంపీలే కాబట్టి అర్హులైన వారిని ఎన్నుకోవాలని సూచించారు. రాజకీయ పార్టీల పట్ల సమాన దృక్పథం కలిగి సభను సజావుగా నడపాలనుకుంటున్నానని చెప్పుకొచ్చారు. తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులతో తనకు సత్సంబంధాలు ఉన్నాయని వారు విజ్ఞులు, దూరదృష్టి గలవారని తెలిపారు.

## బతుకమ్మ కుంట అభివృద్ధి పనులపై హైడ్రా ఫోకస్

హైదరాబాద్, ఆగష్టు 20(సందేశం టైమ్స్) :బతుకమ్మ కుంట అభివృద్ధిపై హైడ్రా ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగానే అభివృద్ధి పనులను హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఇవాళ(బుధవారం) పరిశీలించారు. చెరువును కాపాడేందుకు శాశ్వత సెక్యూరిటీ ఏర్పాట్లు చేయాలని సూచించారు. బతుకమ్మ పండగ వచ్చే లోపు చెరువు సుందరీకరణ పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. చెరువు నిర్మాణం పూర్తయిందని.. సుందరీకరణ పనులు నడుస్తున్నాయని అధికారులు తెలిపారు. చెరువు మధ్యలో బతుకమ్మ ప్రతిబింబించే నిర్మాణం ఏర్పాటు చేయాలని సూచించారు రంగనాథ్.

చెరువు చుట్టూ అందమైన మొక్కలు, ఆహ్లాదకర వాతావరణం కల్పించాలని దిశానిర్దేశం చేశారు. పెద్దలు సేదతీరే గుమ్మటాలు, హైజెనిక్ రెస్ట్ రూమ్‌ల ఏర్పాటు చేయాలని ఆదేశించారు. చెరువు చుట్టూ వాక్ వే, చెట్ల పెంపకం, వాకర్స్ కూర్చునే



ఏర్పాట్లు చేయాలని సూచించారు. చెరువు ఇన్ లెట్ - ఔట్ లెట్ వ్యవస్థలు సరిగా పనిచేసేలా చూడాలని మార్గనిర్దేశం చేశారు. వర్షాకాలంలో వరదనీరు కాలనీలను ముంచకుండా నేరుగా చెరువులోకి చేరే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. చెరువు నిండిన తర్వాత నీరు కిందకు సులభంగా వెళ్లేలా అవాంతరాలు లేకుండా చూడాలని దిశానిర్దేశం చేశారు. బతుకమ్మ కుంటను వరద నివారణ, భూగర్భజలాల పెంపు, పర్యావరణ పరిరక్షణలో నమూనాగా తీర్చిదిద్దాలని హైడ్రా కమిషనర్ రంగనాథ్ సూచించారు.

## గుడ్ న్యూస్..

## ఆ పోస్టుల భర్తీపై తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం




హైదరాబాద్,ఆగష్టు 20(సందేశం టైమ్స్) :త్వరలో మరిన్ని డ్రగ్ ఇన్‌స్పెక్టర్ పోస్టులను మంజూరు చేసి, రిక్రూట్ చేస్తామని తెలంగాణ ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ప్రకటించారు. ఈ పోస్టుల భర్తీతో తద్వారా డ్రగ్ కంట్రోల్ అథారిటీని మరింత బలోపేతం చేస్తామని పేర్కొన్నారు. డ్రగ్ కంట్రోల్ అథారిటీ అధికారులతో ఇవాళ(బుధవారం) రాష్ట్ర సచివాలయంలో మంత్రి దామోదర్ రాజనర్సింహ సమీక్ష సమావేశం నిర్వహించారు. 2024 - 2025లో డీసీఏ వర్క్ ప్రోగ్రెస్‌ను మంత్రికి డీసీఏ డైరెక్టర్ జనరల్ షానవాజ్ ఖాసీం వివరించారు. 2024లో 25,939 తనిఖీలు నిర్వహించి, నిబంధనలు ఉల్లంఘించిన 4142 సంస్థలపై చర్యలు తీసుకున్నామని తెలిపారు. 2025లో జనవరి నుంచి జూలై నెల వరకు 16,481 తనిఖీలు చేశామని, నిబంధనలు ఉల్లంఘించిన 2827 సంస్థలపై చర్యలు తీసుకున్నామని వివరించారు. 2024 జనవరి నుంచి 2025 జులై వరకు 7200 మందుల శాంపిల్స్‌ను పరిక్షించగా, అందులో 186 నాసిరకం మెడిసిన్లుగా తేలాయని, సంబంధిత సంస్థలపై చట్టప్రకారం చర్యలు తీసుకున్నామని తెలిపారు. దోషులకు శిక్ష పడేలా చర్యలు: మంత్రి దామోదర్ రాజనర్సింహ సుమారు 700 కేసులు బుక్ చేశామని, ప్రతి కేసులోనూ దోషులకు శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని అధికారులను తెలంగాణ ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశించారు. జనాలను తప్పుదోవ పట్టించే ప్రకటనలు ఇస్తూ, మెడిసిన్ అమ్మకాలు జరుపుతున్న కంపెనీలు, వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని హుకుం జారీ చేశారు. స్పూరియస్, నాట్ స్టాండర్డ్ డ్రగ్స్ తయారు చేస్తున్న ఫార్మా కంపెనీలు, డిస్ట్రిబ్యూటర్లు, అమ్మకదారులపై కఠినంగా వ్యవహారించాలని నిర్ధేశించారు. మెడిసిన్ అనేది ప్రజల ప్రాణాలతో ముడిపడి ఉన్న అంశమని, ఈ విషయంలో ఎలాంటి ఉపేక్ష పనికిరాదని హెచ్చరించారు. పదే పదే నిబంధనలు ఉల్లఘింసస్తున్న సంస్థలను చట్టప్రకారం పర్మినెంట్‌గా మూసివేయాలని ఆదేశించారు మంత్రి దామోదర్ రాజనర్సింహ.

## యూరియా ఇవ్వకపోతే తీవ్ర ఉద్యమమే.. తేల్చి చెప్పిన హరీష్ రావు



ఆగష్టు 20(సందేశం టైమ్స్) :తెలంగాణ రాష్ట్రంలో యూరియా కొరతతో రైతులు నానా అవస్థలు పడుతున్నారని మాజీ మంత్రి హరీష్ రావు అన్నారు. రైతులకు కంటి నిండా నిద్ర పట్టడం లేదంటూ ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్ ప్రభుత్వం రైతులకు అగ్ర తాంబూలం ఇస్తే రేవంత్ ప్రభుత్వం అద:పాతాళానికి తొక్కుతోందని మండిపడ్డారు. హరీష్ రావు మాట్లాడుతూ.. 'నాడు కాంగ్రెస్ ప్రభుత్వంలో చెప్పులు లైన్‌లో పెట్టే పరిస్థితి ఉండింది.కేసీఆర్ ప్రభుత్వం చెప్పులకు చెక్ పెట్టి రైతుల చెంతకు యూరియా అందించింది. నేడు రైతులు యూరియా కోసం అష్టకష్టాలు పడుతుంటే, రేవంత్ రెడ్డి ప్రభుత్వం మొద్దు నిద్ర పోతోంది. రైతులకు యూరియా అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా పెయిల్ అయింది. సగంమంది రైతులకు రుణమాఫీ కాలేదు. వడ్లు అమ్మి మూడు నెలలు అయినా రైతులకు 1300 కోట్ల రూపాయలు బోనస్ డబ్బులు ఇవ్వలేదు.

## జూబ్లీహిల్స్ బై ఎలక్షన్.. ఎన్నికల సంఘం కీలక షెడ్యూల్

హైదరాబాద్, ఆగష్టు 20(సందేశం టైమ్స్) : జూబ్లీహిల్స్ అసెంబ్లీ బై ఎలక్షన్ కోసం స్పెషల్ సమ్మరీ రివిజన్ షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల సంఘం విడుదల చేసింది. స్పెషల్ సమ్మరీ రివిజన్ షెడ్యూల్‌పై ప్రధాన రాజకీయ పార్టీల ప్రతినిధులతో హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి ఆర్వీ కర్ణన్ ఇవాళ(బుధవారం) సమావేశమయ్యారు. సెప్టెంబర్ 2వ తేదీ నుంచి 17వ తేదీ వరకు స్పెషల్ సమ్మరీ రివిజన్ కార్యక్రమం ఉంటుందని ఆర్వీ కర్ణన్ తెలిపారు. జూలై 1వ తేదీ నాటికి 18 ఏళ్లు నిండినవారు తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేయాలని సూచించారు. సెప్టెంబర్ 2వ తేదీ నుంచి 17వ తేదీ వరకు క్లెయిమ్స్ , అబ్జెక్షన్లు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. సెప్టెంబర్ 25వ తేదీ లోపు క్లెయిమ్స్, అబ్జెక్షన్ల డిస్పోజల్ ఉంటుందని వెల్లడించారు. సెప్టెంబర్ 30వ తేదీన ఫైనల్ ఓటరు జాబితా పబ్లికేషన్ ఉంటుందని వివరించారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు రివిజన్‌లో సహకరించాలని ఎన్నికల అధికారి విజ్ఞప్తి చేశారు.

## బెట్టింగ్ యాప్స్‌పై కేంద్రం బిల్లు.. సజ్జనార్ ఏమన్నారంటే..



ఆగష్టు 20(సందేశం టైమ్స్) :ఆన్‌లైన్ గేమింగ్ బిల్లుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపిన సంగతి తెలిసిందే. డిజిటల్ ప్లాట్‌ఫామ్స్ వేదికగా బెట్టింగ్‌కు పాల్పడితే శిక్ష తప్పదని, భారీ జరిమానాలు ఉంటాయని కేంద్రం తెలిపింది. ఆన్ లైన్ బెట్టింగ్ యాప్స్‌పై కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై వీసీ సజ్జనర్ స్పందించారు. బెట్టింగ్ యాప్స్ కారణంగా ఇప్పటికే చాలామంది బలయ్యారని అన్నారు. బెట్టింగ్ యాప్స్ నిషేధంపై కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం హర్షనీయమన్నారు.బెట్టింగ్ యాప్స్‌తో పాటు మరి కొన్నిటిని నిషేధించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. బెట్టింగ్ యాప్స్ ఏ కోశాన కూడా ఇండియాలోకి రాకుండా చూడాల్సిన బాధ్యత ఉందని అన్నారు. యాప్స్‌పై నిషేధం విధించడంతో నిర్వహణ బాధ్యత కిందిస్థాయి పోలీస్ అధికారులపై ఉందన్నారు. తెలంగాణ, ఆంధ్రాలో యాప్స్‌పై నిషేధం ఉన్నప్పటికీ దొడ్డి దారిన వస్తున్నారని తెలిపారు. వివిధ మార్గాల ద్వారా బెట్టింగ్ యాప్స్ నిర్వాహకులు మళ్లీ మార్కెట్లోకి వచ్చే అవకాశం ఉందని వెల్లడించారు.

# భారత దేశాన్ని టెక్నాలజీలో పరుగులు పెట్టించిన మహనీయుడు..

**సాంకేతిక విప్లవానికి ఆద్యుడు, దేశం కోసం ప్రాణాలు విడిచిన మహనీయుడు రాజీవ్ గాంధీ : నీలం మధు ముదిరాజ్..**

**చిట్కుల్ లో ఘనంగా రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు..**






సందేశం టైమ్స్ సంగారెడ్డి టౌన్ ప్రతినిధి (ఆగస్టు20): భారత దేశాన్ని టెక్నాలజీలో పరుగులు పెట్టించి కొత్త సాంకేతిక విప్లవానికి శ్రీకారం చుట్టి కమ్యూనికేషన్ రంగంలో నూతన సంస్కరణలు తెచ్చిన ఘనత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీకి దక్కుతుందని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ కంటెస్టెడ్ క్యాండిడేట్ నీలం మధు ముదిరాజ్ అన్నారు.బుధవారం రాజీవ్ గాంధీ జయంతిని పురస్కరించుకొని చిట్కుల్లోని ఎన్ఎంఆర్ క్యాంపు కార్యాలయంలో రాజీవ్ గాంధీ చిత్ర పటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నీలం మధు మాట్లాడుతూ భారతదేశంలో కంప్యూటర్ విప్లవానికి బీజంపోసింది రాజీవ్ గాంధీ అని అన్నారు. ప్రపంచ దేశాలతో పోటీపడుతూ కంప్యూటర్ యుగానికి పెద్దపీట వేసి భారీ సంస్కరణలు తీసుకొని వచ్చి సాంకేతిక విప్లవాన్ని అభివృద్ధి దిశగా నడిపించారని కొనియాడారు. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అభివృద్ధి కోసం వివిధ రంగాలలోనీ టెలి కమ్యూనికేషన్ కంప్యూటర్ల ఉత్పత్తులపై ట్యాక్స్ లు తగ్గించి ఆ రంగాన్ని ప్రోత్సహించాడని తెలిపారు. ఆ సంస్కరణలతోనే ప్రస్తుతం దేశం టెక్నాలజీలో ముందుకు దూసుకుపోతుందని వివరించారు. దేశాన్ని మరింత అభివృద్ధి దిశగా నడిపించే ప్రయత్నంలో దేశం కోసం ప్రాణాలర్పించిన ఘనత ఆ మహనీయుడీ సొంతమన్నారు. భారత దేశ అభివృద్ధికి ఆయన ప్రవేశపెట్టిన సంస్కరణలు చిరస్థాయిగా నిలిచిపోతాయని తెలిపారు. ఆ మహానుభావుడిని ఆదర్శంగా తీసుకొని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణని ప్రపంచంలో అభివృద్ధి లో మేటిగా నిలిపేందుకు కృషి చేస్తున్నాడన్నారు.

# ముదిరాజులను పట్టించుకోని ప్రభుత్వం

**ముదిరాజుల అభివృద్ధికి మొండి చేయి**

**రాష్ట్రంలో ముదిరాజుల సంఖ్య ఉన్నప్పటికీ అభివృద్ధిలో శూన్యం**

**చేప పిల్లల పంపిణీ పై నిర్లక్ష్యం చేస్తున్న ప్రభుత్వం**

**జిల్లా మత్స్యశాఖ సొసైటీ డైరెక్టర్ గాండ్ల కృష్ణ ముదిరాజ్**



సందేశం టైమ్స్:సంగారెడ్డి నియోజకవర్గ ఇంచార్జి 20ఆగస్టు: తెలంగాణ రాష్ట్రంలో ముదిరాజులు ఎక్కువ సంఖ్యలో ఉన్నప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం చేప పిల్లల పంపిణీలో నిర్లక్ష్యం వహిస్తుందని మెదక్ జిల్లా మత్స్యశాఖ డైరెక్టర్ గాండ్ల కృష్ణ ముదిరాజ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం మండల కేంద్రమైన కౌడిపల్లి లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు.అధిక శాతం ఉన్న ముదిరాజులకే మొండి చేయి చూపిస్తే స్థానిక ఎన్నికల్లో తమ సత్తా చాటుతామని హెచ్చరించారు. గత ప్రభుత్వం పాలనలో ముదిరాజుల అభివృద్ధి కోసం అనేక అభివృద్ధి పథకాలతో పాటు వివిధ ఉపాధి అవకాశాలు కల్పించిందన్నారు. దీనికి తో పాటు ముదిరాజుల ఎదుగుదలకు చెరువులు, కుంటల్లో చేప పిల్లలు పంపిణీ చేసి ఆదుకుందన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో చేప పిల్లల పంపిణీ ఊసే లేదని అన్నారు. గత బి ఆర్ ఎస్ ప్రభుత్వ హయాంలో మత్స్యకారులకు ఉపాధి కోసం టూ వీలర్స్ వెహికల్, ఫోర్ వీలర్ ఫ్రీగా ఇవ్వడంతో పాటు ఉపాధి పొందడానికి సబ్సిడీ లోన్లు అందజేసింది అన్నారు. మెదక్ జిల్లాలో 308 మత్స్యకార సొసైటీలు ఉన్నాయని ఎంతోమంది చెరువుల మీద ఆధారపడి బ్రతికే మత్స్యకారులు ఉన్నారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం మత్సకారులను పట్టించుకోకుండా చేప పిల్లల పంపిణీలో నిర్లక్ష్య ధోరణి వహిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మత్స్యకారుల అభ్యున్నతికి తోడ్పడకుంటే మత్స్యకారులంతా ఎక్కడికి అక్కడ ఆందోళనలు, ధర్నాలు చేపడతామన్నారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పదివేలకు పైగా మత్స్య సహకార సొసైటీలు ఉన్నాయని ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ముదిరాజుల పట్ల శ్రద్ధ వహించి ముదిరాజుల అభివృద్ధి కోసం చేప పిల్లల పంపిణీ తో పాటు ఉపాధి అవకాశాల కోసం సబ్సిడీ లోన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చెరువు కుంటలు నిండగానే చేప పిల్లల పంపిణీ చేసిందని ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వంలో చెరువు కుంటలు పొంగిపొర్లుతున్నప్పటికీ చేప పిల్లల పంపిణీ చేపట్టడంలో నీలి నీడలు కమ్ముకుంటుందని, ఎంతోమంది మత్స్యకారులు చేప పిల్లలపై ఉపాధి కోల్పోయి రోడ్డునపడి పట్టణాలకు వెళ్లి కంపెనీలలో, అడ్డాకూలిలుగా మారుతున్నారని ఇప్పటికైనా ప్రభుత్వం ముదిరాజుల పట్ల నిర్లక్ష్య ధోరణి వహించకుండా ముదిరాజుల అభ్యున్నతి కోసం కృషి చేయాలని లేదంటే ముదిరాజులు ఏకమై ఆందోళనలు చేయనున్నట్లు హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం కనికరించి ముదిరాజులకు ప్రభుత్వ పథకాలు తోపాటు చేప పిల్లల పంపిణీ చేయాలని కోరారు.

# వట్ పల్లి ప్రెస్ క్లబ్ అధ్యక్షుడిగా జగన్ గౌడ్

సందేశం టైమ్స్:సంగారెడ్డి జిల్లా ప్రతినిధి 20ఆగస్టు సంగారెడ్డి జిల్లా వట్పల్లి మండల్ కేంద్రంలో వట్పల్లి నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా బి.దాసయ్య, సతీష్ గౌడ్, అధ్యక్షుడిగా జగన్ గౌడ్ ఉపాధ్యక్షుడుగా భాగయ్య ప్రధాన కార్యదర్శిగా ప్రభాకర్ కార్యదర్శిగా నరసింహారెడ్డి కోశాధికారిగా షఫీ సభ్యులుగా శ్రీశైలం, మోష, విజయ్ లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం నూతన కమిటీని శాలువాలతో సత్కరించారు

# అసలే వర్షాకాలం...ఇక వ్యాధులు తప్పనిసరి.... ఈ కాలం లో ..పిల్లలు, వృద్ధులకు డెంగ్యూ ప్రమాదం.. ఈ లక్షణాలు కనిపిస్తే జాగ్రత్త..!



వర్షాకాలం చల్లటి వాతావరణం మనకు ఆనందాన్ని ఇస్తుంది. కానీ వర్షంతో పాటు కొన్ని ప్రమాదకరమైన రోగాలు కూడా వస్తాయి. ముఖ్యంగా నీరు నిల్వ ఉండటం వల్ల దోమలు బాగా పెరుగుతాయి. వీటి ద్వారా డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు వ్యాపిస్తాయి. ముఖ్యంగా డెంగ్యూ జ్వరం ఇప్పుడు చాలా మందిని ఇబ్బంది పెడుతోంది. అందుకే దీని లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు తప్పనిసరిగా తెలుసుకోవాలి డెంగ్యూ జ్వరం అంటే ఏంటి..?డెంగ్యూ అనేది %ూవనవం ఖవస్త్రఎజ్ూఱ% అనే దోమ కాటు వల్ల వచ్చే వైరల్ ఫీవర్. ఇది ఒక మనిషి నుంచి ఇంకో మనిషికి నేరుగా వ్యాపించదు. కేవలం దోమ కాటు ద్వారా మాత్రమే వస్తుంది. వర్షాకాలంలో నీరు నిల్వ ఉండే చోట దోమలు ఎక్కువ కాబట్టి డెంగ్యూ వ్యాప్తికి ఇది ప్రధాన కారణం.డెంగ్యూ ప్రధాన లక్షణాలుడెంగ్యూ లక్షణాలు సాధారణ జ్వరాల లాగే ఉంటాయి. కానీ కొన్ని ప్రత్యేకమైన లక్షణాలను బట్టి దాన్ని గుర్తించవచ్చుహై ఫీవర్.. ఉన్నట్టుండి జ్వరం వస్తుంది. ఇది 2 నుంచి 7 రోజులు ఉంటుంది.తీవ్రమైన తలనొప్పి.. ముఖ్యంగా కళ్ల వెనుక భాగంలో విపరీతమైన నొప్పి ఉంటుంది.బాడీ పెయిన్స్.. కీళ్లు, కండరాల నొప్పి చాలా ఎక్కువగా ఉంటుంది. అందుకే డెంగ్యూని బ్రేక్ బోన్ ఫీవర్ అని కూడా అంటారు.వాంతులు.. తల తిరగడం, వాంతులు అవుతాయి. వీటి వల్ల డీహైడ్రేషన్ రావచ్చు.శరీర బలహీనత.. బాడీ వీక్ నెస్, అలసట ఉంటుంది. కొన్ని సార్లు చర్మంపై ఎర్రని దద్దుర్లు కూడా వస్తాయి.తీసుకోవాల్సిన జాగ్రత్తలుడెంగ్యూ లక్షణాలు కనిపిస్తే సొంతంగా మందులు వాడటం చాలా ప్రమాదకరం. వెంటనే డాక్టర్ ను కలిసి బ్లడ్ టెస్ట్ చేయించుకోవడం తప్పనిసరి. అలాగే ఈ జాగ్రత్తలు పాటిస్తే డెంగ్యూను నివారించవచ్చు.ఇంటి చుట్టూ నీరు నిల్వ లేకుండా చూసుకోండి. పాత టైర్లు, కుండీలు, బకెట్లు, కూలర్ లలో నీరు లేకుండా చూసుకోవాలి.రాత్రి పడుకునేటప్పుడు మోస్కిటో నెట్ వాడటం, దోమల రిపెల్లెంట్లు ఉపయోగించడం మంచిది.ఈ కాలంలో ఇమ్యూనిటీ పెంచుకునే ఆహారం తీసుకోవాలి. పండ్లు, కూరగాయలు, ప్రోటీన్ ఉండే ఆహారం తినాలి.మరిగించిన నీళ్లు, హెర్బల్ కషాయాలు, పండ్ల రసాలు తాగాలి. ఇవి డీహైడ్రేషన్ను నివారిస్తాయి.పిల్లలు, వృద్ధులు, షుగర్, బీపీ ఉన్నవారు మరింత జాగ్రత్తగా ఉండాలి.డెంగ్యూ గురించి అపోహలుచాలా మంది డెంగ్యూ ఒకరి నుంచి ఒకరికి వ్యాపిస్తుందని అనుకుంటారు. అది తప్పు. ఇది కేవలం దోమ కాటు ద్వారానే వస్తుంది. అలాగే యాంటీబయోటిక్స్తో డెంగ్యూ నయమవుతుందని భావించడం కూడా పొరపాటే. డెంగ్యూకు ప్రత్యేక యాంటీబయోటిక్ ట్రీట్మెంట్ ఉండదు. డాక్టర్ సలహా ప్రకారం విశ్రాంతి తీసుకుని సరైన చికిత్స చేయించుకుంటేనే ఉపశమనం లభిస్తుంది.వర్షాకాలం ఎంత అందంగా ఉన్నా.. మనం అప్రమత్తంగా ఉండాలి. లక్షణాలు కనిపించిన వెంటనే డాక్టర్ ని కలవడం, దోమల నివారణ చర్యలు తీసుకోవడం చాలా ముఖ్యం. ఈ జాగ్రత్తలు పాటిస్తే డెంగ్యూ నుంచి మనల్ని మనం కాపాడుకోవచ్చు.

# ప్రభుత్వ ఆసుపత్రిలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు





సందేశం టైమ్స్:సంగారెడ్డి జిల్లా ప్రతినిధి 20ఆగస్టు: సంగారెడ్డి జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య, సబ్ కలెక్టర్ ఉమా హారతితో కలిసి బుధవారం నారాయణఖేడ్ ఏరియా ఆసుపత్రి, మాతా–శిశు సంరక్షణ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీలు చేశారు. ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రజలకు నాణ్యమైన చికిత్స అందించాలని వైద్యులకు సూచించారు. ఔట్పేషెంట్, ఇన్పేషెంట్ వార్డులు, లేబర్ రూమ్, ఫార్మసీ, ల్యాబ్, డయాలసిస్ సెంటర్, జనరేటర్ విభాగాలను సమీక్షించారు. ఉద్యోగుల హాజరు, మెడిసిన్ స్టాక్, భోజన నాణ్యతను పరిశీలించి, రోగుల నుంచి వైద్యసేవలపై ఆరా తీశారు.

# సిర్గాపూర్ మండలంలోని నల్లవాగు మధ్యతరహా సాగునీటి ప్రాజెక్టును జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య, నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ ఉమా హారతి సందర్శించారు.





సందేశం టైమ్స్:సంగారెడ్డి జిల్లా ప్రతినిధి 20ఆగస్టు: ఈ సందర్భంగా ప్రాజెక్టుకు వస్తున్న ఇన్ఫ్లో, అవుట్ ఫ్లో వివరాలను ఇరిగేషన్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. అధికారులతో ప్రాజెక్టు నీటి మట్టాలు, సాగు సౌకర్యాలు, పునరుద్ధరణ పనుల పురోగతిని సమీక్షించారు. లెఫ్ట్ అండ్ రైట్ కెనాల్ లకు నిర్మాణ పనులు జరుగుతున్నాయని వాటిని వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. ప్రాజెక్టు పరిధిలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. రైతులకు సకాలంలో నీటి సరఫరా అందేలా తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. అదేవిధంగా నారాయణఖేడ్ నియోజకవర్గ పరిధిలో వంతెనలు, రహదారుల పరిస్థితిని విచారించారు.

# మెడిసిన్ విషయంలో తప్పుదోవ పట్టించే ప్రకటనలు ఇచ్చే సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలి



సందేశం టైమ్స్ న్యూస్ నారాయణాఖేడ్ ప్రతినిధి ఆగష్టు 20: డ్రగ్ కంట్రోల్ అథారిటీ అధికారులను మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశించారు.ఈ మేరకు డ్రగ్ కంట్రోల్ అథారిటీ పనితీరుపై మంగళవారం, వెంగళరావు నగర్లోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్లో మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు.2024 %ః% 2025లో డీసీఏ వర్క్ ప్రోగ్రెస్ను మంత్రికి డీసీఏ డైరెక్టర్ జనరల్ షానవాజ్ ఖాసీం వివరించారు.2024లో 25,939 తనిఖీలు నిర్వహించి, నిబంధనలు ఉల్లంఘించిన 4142 సంస్థలపై చర్యలు తీసుకున్నామని తెలిపారు.

2025లో జనవరి నుంచి జూలై వరకు 16,481 తనిఖీలు చేశామని, నిబంధనలు ఉల్లంఘించిన 2827 సంస్థలపై చర్యలు తీసుకున్నామన్నారు.2024 జనవరి నుంచి 2025 జూలై వరకు 7200 మెడిసిన్ సాంపిల్స్ను



టెస్ట్ చేయగా, అందులో 186 నాసిరకం మెడిసిన్గా తేలిందని, సంబంధిత సంస్థలపై చట్టప్రకారం చర్యలు తీసుకున్నామన్నారు.

సుమారు 700 కేసులు బుక్ చేశామని వివరించారు. ప్రతి కేసులోనూ దోషులకు శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని అధికారులను మంత్రి ఆదేశించారు

# సంపాదకీయం

## సైద్ధాంతిక పోరులో న్యాయకోవిదుడు

'గోవా తొలి లోకాయుక్తగా సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ సుదర్శన్‌రెడ్డిని నియమించాలనుకుంటున్నాను' అని 2013లో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి మనోహర్ పరిక్కర్ అధికారులకు, పాలక పార్టీ నేతలకు చెప్పినప్పుడు వారు ఆశ్చర్యపోయారు. 'అదేమిటి సార్, ఆయన ఆలోచనా విధానానికీ మన ఆలోచనా విధానానికీ ఏ మాత్రం సరిపడదు. ఆయన బీజేపీ భావజాలం అంటే ఇష్టపడరు. పైగా స్వతంత్రంగా ఆలోచిస్తారు' అని పార్టీ నేత ఒకరు అభ్యంతరం వ్యక్తం చేశారు. 'లోకాయుక్త పదవిలో అలా స్వతంత్రంగా ఆలోచించేవారే కావాలి. నిక్కచ్చిగా, నిజాయితీగా వ్యవహరించేవారే ఆ పదవిని సరిగా నిర్వహించగలరు. అలాంటి పదవుల్లో ఉన్నవారు సిద్ధాంతాలకు అతీతంగా ఉండాలి. నేను ఎంతో మంది న్యాయమూర్తుల పేర్లను, వారి నేపథ్యాన్ని పరిశీలించిన తర్వాత ఈ నిర్ణయానికి వచ్చాను' అని మనోహర్ పరిక్కర్ జవాబిచ్చారు. ఆ తర్వాత ఆయన జస్టిస్ సుదర్శన్‌రెడ్డికి ఫోన్ చేశారు. 'మిమ్మల్ని లోకాయుక్తగా నియమించాలనుకుటున్నాను. దయచేసి ఆ పదవి స్వీకరించండి' అని అభ్యర్థించారు. తన ఆలోచనా విధానం వేరని, తాను స్వతంత్రంగా వ్యవహరిస్తానని సుదర్శన్‌రెడ్డి చెప్పినా పరిక్కర్ వినలేదు. 'అవన్నీ నాకు తెలుసు..' అని ఆయన చెప్పారు. దీనితో జస్టిస్ సుదర్శన్‌రెడ్డి గోవా లోకాయుక్త చట్టం ప్రతినొకదాన్ని తెప్పించుకుని అధ్యయనం చేశారు. అందులో ఎన్నో లోపాలున్నాయని, ముఖ్యంగా ఈ చట్టం ప్రకారం ముఖ్యమంత్రిని విచారించే అధికారం లోకాయుక్తకు లేదని తెలుసుకున్నారు. ఆ చట్టాన్ని సవరిస్తేనే లోకాయుక్త పదవిని ఆమోదిస్తానని చెప్పారు. అందుకు పరిక్కర్ ఆమోదించడమే కాక ముఖ్యమంత్రిని కూడా దాని పరిధిలో చేర్చడంతో ఇక కాదనలేక జస్టిస్ సుదర్శన్‌రెడ్డి ఆ పదవిని స్వీకరించారు. తన సిబ్బందిని తానే నియమించుకుంటానని చెప్పినా పరిక్కర్ అంగీకరించారు. లోకాయుక్త పదవి స్వీకరించిన తర్వాత ఆయన మొదట మనోహర్ పరిక్కర్‌పై వచ్చిన ఆరోపణలనే విచారణకు స్వీకరించి సీఎంను తన కార్యాలయానికి పిలిపించారు. పరిక్కర్ ఏ మాత్రం సంకోచించకుండా ఎటువంటి మందీ మార్బలం లేకుండా వచ్చి జస్టిస్ సుదర్శన్‌రెడ్డి అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పారు. వ్యక్తిగత కారణాల వల్ల లోకాయుక్త పదవిలో జస్టిస్ సుదర్శన్‌రెడ్డి ఎక్కువ కాలం ఉండలేదు. అయితే తాము నియమించిన వారందరూ తమకు జీ హుజూర్‌గా ఉండాలని భావించే నేటి రాజకీయ నాయకుల్లో ఎందరు మనోహర్ పరిక్కర్ లాగా ఉంటారు? ఎందరు జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి లాగా నిక్కచ్చిగా వ్యవహరిస్తారు?

ఉప రాష్ట్రపతి పదవికి తమ అభ్యర్థిగా జస్టిస్ సుదర్శన్ రెడ్డిని ఇండియా కూటమి ప్రకటించింది. ఇవాళ ఒక చారిత్రక నేపథ్యంలో జరుగుతున్న ఎన్నిక ఇది. కొద్ది రోజుల క్రితం వరకు ఉప రాష్ట్రపతిగా ఉన్న జగదీప్ దన్‌ఖడ్ పార్లమెంట్ వర్షాకాల సమావేశాల తొలిరోజే రాజీనామా చేశారు. ఈ హఠాత్పరిణామం, ఇప్పటి వరకూ ఒక రాజ్యాంగ హోదాగా భావిస్తున్న ఉప రాష్ట్రపతి పదవి విలువపై చర్చకు దారితీసింది. మరో రాజ్యాంగ వ్యవస్థ అయిన ఎన్నికల కమిషన్ పనితీరుపై దాదాపు నెలరోజులుగా వర్షాకాల సమావేశాలు స్తంభించిపోయాయి. ప్రజల ఓట్లనే కొల్లగొడుతున్నారంటూ ప్రతిపక్షాలు వీధి ఆందోళనలకు దిగాయి. ఈ పరిస్థితుల్లో ఎన్డీఏ అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్‌తో పోటీకి నిలబెట్టేందుకు జస్టిస్ సుదర్శన్‌రెడ్డిని ఇండియా కూటమి ఎంపిక చేసింది. అయితే నెగ్గుకు రాగలదని చెప్పలేం. గెలుపోటములతో నిమిత్తం లేకుండా ఈ పోటీని సంకేతాత్మక సైద్ధాంతిక పోరుగా మార్చేందుకు, తమ ఆలోచనా విధానాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు తమ నిర్ణయం దోహదపడుతుందని ఆ కూటమి నేతలు భావిస్తున్నట్లు కనపడుతోంది. జస్టిస్ సుదర్శన్‌రెడ్డి గతంలో ఉపరాష్ట్రపతి పదవి నిర్వహించిన మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ హిదయతుల్లా బాటలో నడిచిన న్యాయకోవిదుడు. గోలక్‌నాథ్ కేసులో అప్పటి సీజే కోకా సుబ్బారావుకు బాసటగా నిలిచి ప్రాథమిక హక్కులను పార్లమెంట్ సవరించడానికి వీల్లేదని జస్టిస్ హిదయతుల్లా స్పష్టంగా చెప్పారు. పార్లమెంట్ ఉభయ సభలు ఏకగ్రీవంగా ఆమోదించినా సరే, రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కులను కుదించే హక్కు దానికి లేదని, ఎందుకంటే పార్లమెంటు కూడా రాజ్యాంగం ప్రకారం ఏర్పడినదేనని చెప్పిన న్యాయమూర్తి జస్టిస్ హిదయతుల్లా. ఆయన నిర్వహించిన ఉపరాష్ట్రపతి పదవికి దాదాపు నాలుగు దశాబ్దాల తర్వాత జస్టిస్ సుదర్శన్‌రెడ్డిని పోటీ చేయించేందుకు ఇండియా కూటమి నిర్ణయించడం విశేషం.ఎందుకంటే సుదర్శన్‌రెడ్డి సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా ఉన్న నాలుగున్నరేళ్ల కాలంలో అప్పటి యూపీఏ ప్రభుత్వ నిర్ణయాలు చాలా వాటిని తప్పుపట్టారు. 'సహజవాయువు ప్రజలకు చెందుతుంది. దాన్ని వెలికితీసే కాంట్రాక్టర్ రిలయన్స్ కావచ్చు కాని దాని ధర ప్రభుత్వం నిర్ణయించాల్సిందే'నని విస్పష్టంగా తీర్పు చెప్పిన బెంచ్‌లో ఆయన ఉన్నారు. విదేశీ బ్యాంకుల్లో దాచుకున్న నల్లధనాన్ని తిరిగి రప్పించడంలో విఫలమైన ప్రభుత్వాన్ని ఆయన తీవ్రంగా విమర్శించారు. ఆర్థిక నేరస్థులపై ప్రభుత్వం మెతకగా వ్యవహరిస్తోందని ఆక్షేపించారు. వారిపై దర్యాప్తు చేసేందుకు సిట్‌ను నియమించాలని ఆదేశించారు. 'ద కేసెస్ దట్ ఇండియా ఫర్ గాట్' (భారతదేశం మరిచిపోయిన కేసులు) అన్న పుస్తకంలో ప్రముఖ రాజ్యాంగ నిపుణుడు చింతన్ చంద్రచూడ్ ప్రస్తావించిన పది ముఖ్యమైన తీర్పుల్లో జస్టిస్ సుదర్శన్‌రెడ్డి ఇచ్చిన తీర్పు కూడా ఉన్నది. ఛత్తీస్‌గఢ్‌లో నక్సలైట్లను ఆదివాసీలతోనే తుదముట్టించేందుకు ఏర్పర్చిన సల్వాజుడుంను రాజ్యాంగ వ్యతిరేకమని జస్టిస్ సుదర్శన్‌రెడ్డి సంచలన తీర్పు ఇచ్చారు. సామాన్యులను, ముఖ్యంగా చదువు రాని అమాయక ఆదివాసీ యువతను హింసాకాండకు పాల్పడేందుకు ప్రోత్సహించకూడదని, ఇలాంటి అనైతిక మార్గాలను రాజ్యాంగ విలువలు అనుమతించబోవని ఆయన విస్పష్టీకరించారు.

# గొడుగులు పంపిణీ చేసిన..ఆర్ కే వై టీమ్

సందేశం టైమ్స్ :సంగారెడ్డి నియోజకవర్గ ఇన్చార్జి ఆగస్టు 20: రాష్ట్రం లో వర్షాకాలం దృష్టిలో ఉంచుకొని పేదలకు గొడుగులు పంపిణీ చేయాలని సంకల్పంతో ముందుకు వచ్చిన ఆర్ కే వై టీమ్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించిన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, శేరిలింగంపల్లి అసెంబ్లీ కంటేస్టెడ్ ఎమ్మెల్యే, ఇంఛార్జి రవికుమార్ యాదవ్.అనంతరం నిష్కల్, వికాస్ అనే యువకులను కండువా కప్పి భారతీయ జనతా పార్టీ లోని ఆహ్వానించిన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, శేరిలింగంపల్లి అసెంబ్లీ కంటేస్టెడ్ ఎమ్మెల్యే, ఇంఛార్జి రవికుమార్ యాదవ్,ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..వర్షాకాలం దృష్టిలో ఉంచుకుని నిరుపేదలకు ఉచిత గొడుగుల పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన గణేష్ ముదిరాజ్ నీ అభినందిస్తూ,అలాగే ఇలాంటి ప్రజా సంక్షేమ,సేవా కార్యక్రమాలలో ఆర్. కే.టీమ్ సభ్యులు ఎల్లప్పుడూ మొదటి వరుసలో ఉంటారని కొనియాడారు, వీటితో పాటు కాలనీ లు,బస్తీలలో ప్రజలు ఎలాంటి ఇబ్బందులు పడకుండా ఎక్కడైనా సమస్య ఉంది అంటే వెంటనే స్పందించి పరిష్కరించేలా చూడాలని కోరారు,మీకు ఎలాంటి సహకారం కావాలన్న అందుబాటులో ఉంటామని హామీ ఇచ్చారు,అన్ని డివిజన్లలోని



నాయకులు,కార్యకర్తలు, అభిమానులు ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించే దిశగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు ఆకుల లక్ష్మణ్,రాజేష్ గౌడ్,జె.శ్రీనివాస్, శివరాజ్, పాపయ్య, పవన్,రాహుల్, హరి, జిహెచ్ఎంసి పారిశుధ్య సిబ్బంది మొదలగువారు పాల్గొన్నారు.

# గంజాయి పట్టివేత



సందేశం టైమ్స్:సంగారెడ్డి నియోజకవర్గ ఇన్చార్జి ఆగస్టు 20: అసిస్టెంట్ కమిషనర్ ఎన్‌ఫోర్స్‌మెంట్ మెదక్ డివిజన్ ప్రొహిబిషన్ %ు% ఎక్సైజ్ ఆఫీసర్ గారి ఆదేశాల మేరకు మెదక్ డివిజన్ గారి ఆధ్వర్యం లో తేదీ:- 20/08/2025 న ఎన్ఫోరసెమెంట్ , మెదక్ డివిజన్ టీమ్ కంకోల్ టోల్ ప్లాజా వద్ద తనిఖీలు చేయాగా కరీంనగర్ కి చెందిన తాజ్ మొహమ్మద్ అనే వ్యక్తి అక్రమంగా ఎండు గంజాయిని బీదర్ లో కొని కర్ణాటక ఆర్టీసీ బస్ లో హైదరాబాద్ తీసుకొని వస్తుండగా పట్టుబడ్డాడు అతని వద్ద నుండి (440 ) గంజాయి గ్రామ్ ఎండు గంజాయిని, మరియు (01)మొబైల్ ఫోన్ ను స్వాధీనపరచుకుని , కేసు నమోదు చేసి నిందితుడీని సంగారెడ్డి ఎక్సైజ్ స్టేషన్ కి తరలించారు . ఇట్టి దాడులలో ఎన్ఫోరసెమెంట్ సీఐ చంద్రశేఖర్ , ఎస్ ఐ అనిల్ కుమార్ , హెడ్ కానిస్టేబుల్ అలీం ,కానిస్టేబుల్స్ యాదయ్య మరియు కరీం తదితరులు పాల్గొన్నారు.

# నేటి నుంచి కోర్టు ఉద్యోగాలకు పరీక్షలు : జిల్లా జడ్జి



ఏలూరు క్రైం, ఆగస్టు 20 (సందేశం టైమ్స్)ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని కోర్టులలో పలు పోస్టులకు దరఖాస్తు చేసుకున్న వారికి ఈనెల 20 నుంచి 24వ తేదీ వరకు పరీక్షల నిర్వహిస్తామని జిల్లా జడ్జి ఎస్.శ్రీదేవి తెలిపారు. జిల్లా జడ్జి చాంబర్‌లో పరీక్షల నిర్వహణ వివరాలు విలేకరుల సమావేశంలో ఆమె తెలిపారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని పలు కోర్టులలో స్టెనోగ్రాఫర్స్, టైపిస్ట్, కాపీయిస్ట్, డ్రైవర్ తదితర పోస్టులకు జారీ చేసిన నోటిఫికేష్‌కు 4,207 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారని, వీరికి ఈనెల 20 నుంచి 24 వరకు మూడు కేంద్రాలలో అనగా ఏలూరులోని సీఆర్‌ఆర్ ఇంజనీరింగ్ కాలేజీ, సిద్దార్థ క్వెస్ట్ కళాశాల, భీమవరంలోని డీఎన్‌ఆర్ కళాశాల కేంద్రాలలో పరీక్షలు నిర్వహించ నున్నారు. పరీక్ష ఆన్లైన్ విధానంలోనే ఉంటుందని, ఈనెల 20, 21, 22, 24 తేదీల్లో జరిగే నాలుగు రోజులపాటు మూడు షిప్టుల్లో, 23వ తేదీన రెండు షిప్టులలో పరీక్ష నిర్వహిస్తామన్నారు. స్టెనో గ్రాఫర్ గ్రేడ్ 3, టైపిస్ట్, కాపియిస్ట్, డ్రైవర్ పోస్టులకు కంప్యూటర్ పరీక్షలతో పాటు నైపుణ్యం పరీక్షలు ఉంటాయన్నారు. అభ్యర్థులు హాల్ టిక్కెట్‌లతో పాటు ఫొటోగుర్తింపు కార్డులు తీసుకురావాలని, పరీక్ష సమయానికి 15 నిమిషాల ముందు వరకు మాత్రమే పరీక్ష కేంద్రంలోకి అనుమతిస్తామన్నారు పరీక్షలకు హాజరయ్యే విభిన్న ప్రతిభా వంతులకు వారి విజ్ఞప్తి మేరకు స్క్రైబ్‌ని ఏర్పాటు చేస్తామన్నారు. వారిని నిర్ధేశించిన సమయం కంటే 30 నిమిషాలు అదనపు సమయం ఇవ్వడం జరుగుతుందన్నారు. హాల్‌టిక్కెట్ డౌన్లోడ్‌లో సాంకేతిక సమస్యలు, తదితర సమస్యల పరిష్కారం కోసం అభ్యర్థుల కోసం 0863 2372752 నంబరుతో హెల్ప్‌లైన్ ఏర్పాటు చేశామన్నారు. పరీక్షల నిర్వహణకు, సాంకేతిక సమస్యల పరిష్కా రానికి ప్రతి పరీక్షా కేంద్రానికి ప్రత్యేక అధికారిని, సాంకేతిక సిబ్బందిని నియమించా మన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద బందోబస్తు ఏర్పాట్లు చేయా లని పోలీసు శాఖ అధికారులను, విద్యుత్ సరఫరాలో ఎటువంటి అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని విద్యుత్ అధికారులను ఆదేశించామన్నారు. పరీక్షల కేంద్రాలకు అవసరమైన రవాణా సౌకర్యాలు ఏర్పాటు చేయాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించామన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్న ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# ట్యాంకర్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

పూసపాటిరేగ,

ఆగస్టు 20 (సందేశం టైమ్స్))మండలంలో పేరాపురం వద్ద జాతీయ రహదారిపై ఆగి ఉన్న ట్యాంకర్ లారీని శ్రీకాకుళం నుంచి విశాఖపట్నం వెళ్తున్న ఆర్టీసీ బస్సు వెనుక నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో బస్సు ముందు భాగం నుజ్జయ్యింది. బస్సులో ప్రయాణికులకు స్వల్ప గాయాల య్యాయి. వీరిని




సమీపంలోని సుందరపేట సీహెచ్‌సీకి తరలించి, చికిత్స చేశారు. అదపాక బంగారమ్మ అనే ప్రయాణికురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నమోదు చేసినట్టు ఎస్ఐ దుర్గాప్రసాద్ తెలిపారు. బస్సు డ్రైవర్ నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేయడం వల్లే ఈ ప్రమాదం సంభవించినట్టు పోలీసులు తెలిపారు.

# డోకిపర్రులో సుందరీమణుల సందడి




గుడ్లవల్లేరు, ఆగస్టు 20 (సందేశం టైమ్స్) కృష్ణా జిల్లా డోకిపర్రు గ్రామంలో విశ్వసుందరి-2025, ఏషియన్ సుందరి హల్‌చల్ చేశారు. ప్రముఖ పారిశ్రామికవేత్త ఎంఈఐఎల్ ఎండీ పీవీ కృష్ణారెడ్డి స్వగ్రామం డోకిపర్రులో ఆయన సతీమణి సుధారెడ్డి నిర్వహణలోని సుధా ఫౌండేషన్, ఎంఈఐఎల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రొమ్ముకేన్సర్ నిర్ధారణ పరీక్షల వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని విశ్వసుందరి ఓపెల్ సుచతా చుంవాంగ్రీస్, ఏషియన్ సుందరి కృష్ణా గ్రావిడేజ్ ప్రారంభించారు.

# మతోన్మాదాన్ని అణిచివేస్తాం



పార్వతీపురం, ఆగస్టు 20 (సందేశం టైమ్స్)మతోన్మాదం, ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా అణిచివేస్తామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ అన్నారు. ఉగ్ర కదలికలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పార్వతీపురం మన్యం జిల్లా పర్యటనలో భాగంగా మంగళవారం ఆయన వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. తొలుత ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి పాత బస్టాండ్ వరకు శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం కార్యకర్తల సమావేశం నిర్వహించి, అభిప్రాయాలు సేకరించారు. నామినేటెడ్ పదవుల్లో బీజేపీకి రావాల్సిన వాటా సాధిస్తామని చెప్పారు. దీనిపై సీఎం చంద్రబాబుతో చర్చించినట్లు తెలిపారు. సమావేశం తర్వాత మాధవ్ విలేకరులతో మాట్లాడారు. మతోన్మాదాన్ని, ఉగ్రవాదాన్ని అణిచివేయడంలో ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ప్రధాని మోదీ నాయకత్వంలో ఉగ్రవాదులను మట్టుబెట్టి భారత్‌ను ఉగ్రరహిత దేశంగా తీర్చిదిద్దుతామని అన్నారు. బంగ్లాదేశ్ నుంచి మన దేశంలోకి చొరబడిన అనేకమంది రోహింగ్యాలు యువతను ఉగ్రవాదం వైపు మళ్లిస్తున్నారని ఆయన ఆరోపించారు. నామినేటెడ్ పదవులు నిష్పత్తి ప్రకారం వస్తాయని, ఎవరూ నిరాశ పడవద్దని చెప్పారు. పదవుల పంపిణీకి సంబంధించి కూటమి పార్టీల్లో కొంతమేర అసంతృప్తి ఉన్నమాట వాస్తమేనని మాధవ్ పేర్కొన్నారు.

# బకాయిలు.. వడ్డీతో సహా ఇప్పించండి




అమరావతి, ఆగస్టు 20 (సందేశం టైమ్స్) వైసీపీ హయాం నుంచి పెండింగ్‌లో ఉన్న కరువు భత్యం(డీఏ), 11వ వేతన సంఘం(పీఆర్‌సీ) బకాయిలను చెల్లించేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఉద్యోగుల సంఘం(ఏపీసీపీఎస్ఈఏ)హైకోర్టును ఆశ్రయించింది. దీనిపై విచారణ జరిపిన న్యాయస్థానం కౌంటర్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఆర్థికశాఖ ముఖ్యకార్యదర్శి, ట్రెజరీ, అకౌంట్స్ డైరెక్టరేట్, పే అండ్ అకౌంట్స్ ఆఫీసర్, వర్క్ అకౌంట్స్ డైరెక్టర్‌కు నోటీసులు జారీ చేసింది. పిటిషన్‌పై పూర్తిస్థాయి విచారణ జరిపేందుకు కౌంటర్ అవసరమని అభిప్రాయపడింది. విచారణను 4 వారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్. విజయ్ ఉత్తర్వులు జారీ చేశారు. వైసీపీ హయాంలో 2020 నుంచి పెండింగ్‌లో ఉన్న కరువు భత్యం బకాయిలతో పాటు పీఆర్‌సీ బకాయిలను వడ్డీతో సహా చెల్లించేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని సంఘం అధ్యక్షుడు పఠాన్ బాజీ పిటిషన్‌లో అభ్యర్థించారు. పిటిషనర్ తరఫున న్యాయవాది అంజన రామకామేశ్వరి వాదనలు వినిపించారు.

# దివ్యాంగ పెన్షన్లకు మరో అవకాశం




అమరావతి,ఆగస్టు 20 (సందేశం టైమ్స్) దివ్యాంగ పెన్షన్‌కు అప్పీలు చేసుకునేందుకు ప్రభుత్వం మరోసారి అవకాశం కల్పించింది. తాము పెన్షన్‌కు అర్హులమని భావించే దివ్యాంగులు వెంటనే దరఖాస్తు చేసుకునే వెసులుబాటు కల్పిస్తున్నట్లు వైద్య ఆరోగ్యశాఖ సెకండరీ హెల్త్ డైరెక్టర్ ఒక ప్రకటన ద్వారా తెలిపారు. పెన్షన్‌కు అనర్హులుగా నోటీసు అందుకున్న వారు, తాము అర్హులమని భావిస్తే వెంటనే సమీప ఎంపీడీవో లేదా మునిసిపల్ కమిషనర్లకు అర్జీలు సమర్పించాలని సూచించారు.

# ముగ్గురు దారి దోపిడీ దొంగల అరెస్ట్

## వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

## రూ.3.15 లక్షల విలువైన సొత్తు రికవరీ




తాడేపల్లిగూడెం రూరల్, ఆగస్టు 20 (సందేశం టైమ్స్)కారులో వచ్చి బస్సు చార్జీకే మీరు వెళ్లే చోటకు తీసుకెళ తామని చెప్పి ప్రయాణికుడిని బెదిరించి దోపిడీ చేసిన ముఠాను అరెస్ట్ చేసి, వారి నుంచి రూ.3.15 లక్షల సొత్తు రికవరీ చేశామని తాడేపల్లిగూడెం పోలీసులు తెలిపారు. పెంటపాడు బీసీ కాలనీకి చెందిన కోట జగదీష్, తణుకు మండలం ముద్దాపురానికి చెందిన యల్లా సంతోష్, గణపవరం మండలం మొయ్యేరుకు చెందిన ఆంధ్రు హర్షకుమార్ జల్సాలకు అలవాటు పడి దారి దోపిడీలకు పాల్పడుతున్నారన్నారు. ఈనెల 5వ తేదీన తాడేపల్లిగూడెంలో ఏలూరు బస్టాండ్ రోడ్డు వద్ద తాడేపల్లిగూడెంకు చెందిన మేధా సుబ్రహ్మణ్య శర్మ ఏలూరు బస్సు ఎక్కేందుకు నిలిచిఉండగా ఒక కారు వచ్చి 'మేం ఏలూరు కిరాయికి వెళ్తున్నాం.. బస్సు చార్జి ఇవ్వండి దింపేస్తాం' అంటూ ఆయనను కారులో ఎక్కించుకున్నారు. అక్కడ నుంచి కొంత దూరం వెళ్లాక నిర్మానుష్య ప్రాంతంలో కారు ఆపి.. చాకుతో బెదిరించి అతడి వద్ద నుంచి రూ.3,500 నగదు, లాకెట్‌తో కూడిన బంగారం చైన్, మూడు బంగారపు ఉంగరాలు చోరీ చేశారు. దీనిపై బాధితుడి ఫిర్యాదు మేరకు సీఐ ఆదిప్రసాద్, ఎస్ఐలు నాగ రాజు, బాదం శ్రీను సిబ్బంది దర్యాప్తు చేపట్టి నిందితులను పట్టుకుని వారి నుంచి రూ.3.15 లక్షల విలువ చేసే చోరీ సొత్తుతోపాటు కారు, చాకును స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తు వేగంగా పూర్తి చేసి నిందితులను పట్టుకున్న పోలీస్ సిబ్బందిని ఎస్పీ అద్నాన్ నయీం అస్మి, డీఎస్పీ విశ్వనాథ్ అభినందించారు.

# డీఎస్సీ సర్టిఫికెట్ల పరిశీలన




ఒంగోలు విద్య, ఆగస్టు 20 (సందేశం టైమ్స్) మెగా డీఎస్సీలో భాగంగా ఉపాధ్యాయ నియామకాల ప్రక్రియ వేగవంతమవుతోంది. ఫలితాలను ప్రకటించిన పాఠశాల విద్యాశాఖ ఖాళీలపై దృష్టి కేంద్రీకరించింది. సోమవారం అన్ని జిల్లాల నుంచి టీచర్ పోస్టుల ఖాళీలను స్వీకరించిన విద్యాశాఖ డైరెక్టర్ కార్యాలయం వాటిని ధ్రువీకరించింది. డీఎస్సీలో ప్రకటించిన ఖాళీలకు అనుగుణంగా ప్రక్రియను చేపట్టనున్నారు. పాఠశాలల ఎంపికకు కసరత్తు ప్రారంభమైంది. నో టీచర్ స్కూళ్లు, బదిలీ అయి రిలీవర్ లేని కారణంగా అదే పాఠశాలల్లో పనిచేస్తున్న పోస్టులు, 50శాతం లోపు టీచర్లు ఉన్న పాఠశాలలకు కొత్త వారిని కేటాయించనున్నారు. డీఎస్సీలో ప్రతిభ చూపి అత్యధిక మార్కులు సాధించి మెరిట్ జాబి తాలో మొదట నిలిచిన అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలనను ఈనెల 21న నిర్వహించనున్నారు. గతంలో మాదిరి టీచర్ పోస్టులకు ఎంపికైన వారి సర్టిఫికెట్లు కాకుండా మెరిట్‌లో ముందున్న వారిని పరిశీలనకు ఆహ్వానిస్తున్నారు. అందుకు 1:1 నిష్పత్తి ప్రకారం ఒక పోస్టుకు ఒక అభ్యర్థినే ఆయా రిజర్వేషన్ల ప్రాతిపదికగా ఎంపిక చేస్తున్నారు. పరిశీలనలో అన్నీ సక్రమంగా ఉన్నట్లు తేలిన తర్వాత పోస్టులకు అర్హులను ఎంపిక చేస్తారు. ఎంపికైన అభ్యర్థులు డీఎస్సీ దరఖాస్తులో తాము పేర్కొన్న విద్యార్హతలు, రిజర్వేషన్లు, ఇతర వివరాలకు సంబంధించిన సర్టిఫికెట్లను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలి. అన్ని ఒరిజనల్ ధ్రువీకరణ పత్రాలతో పరిశీలనకు హాజరుకావాలి

# డోలీలో 8 కిలోమీటర్లు



ఆగస్టు 20 (సందేశం టైమ్స్)అది అత్యంత క్లిష్టమైన సమయం. కానీ వాహనం ఊరులోకి రాలేని దైన్యం. ఆలస్యమైతే రెండు ప్రాణాలకు భయం. ఇక చేసేదిలేక ఆ ఊరి జనం డోలీని పట్టుకున్నారు. నిండు గర్భిణిని 8 కిలోమీటర్ల దూరం మోసుకెళ్లి...వాహనంలోకి ఎక్కించి..ఆస్పత్రికి తరలించారు. ఆ మహిళ పండండి మగబిడ్డకు జన్మనిచ్చింది. వర్షాల సమయంలో కొత్తబట్టివలస వాసుల దుస్థితి.

మండలంలోని గోపాలరాయుడుపేట పంచాయతీ పరిధిలోగల కొత్తబట్టివలస గిరిజన గ్రామానికి చెందిన సిదరపు గౌరమ్మకు పురిటి నొప్పులు ఎక్కువ కావడంతో డోలీలో తరలించాల్సి వచ్చింది. ఆ గ్రామానికి పక్కా రహదారి లేకపోవడం... ఇటీవల కురుస్తున్న వర్షాలకు ఉన్న రోడ్డు బురదమయం కావడంతో కొత్తబట్టివలస నుంచి గోపాలరాయుడుపేట వరకూ ఎనిమిది కిలోమీటర్లు డోలీలోనే గ్రామస్థులు మోసుకొని వెళ్లారు. అక్కడి నుంచి పది కిలోమీటర్ల దూరంలో గల పిరిడి పీహెచ్‌సీకి 108 వాహనంలో తరలించారు. అనంతరం వైద్యాధికారి రఘువంశీ పరీక్షించి ప్రసవానికి ఏర్పాట్లు చేయించారు. ఆమెకు మగబిడ్డ జన్మించాడని...తల్లీబిడ్డలు క్షేమంగా ఉన్నారని రఘువంశీ తెలిపారు.మండలంలోని కొత్త బట్టివలస, అక్కేనవలస, మోసూ రువలస, సియోనువలస, కృపావలస తదితర గిరిజన గ్రామాలకు రోడ్డు సౌకర్యం లేదు. దీంతో ఏటా వర్షాకాలంలో అనారోగ్యంతో బాధ పడేవారిని, గర్భిణులను డోలీలో ఆస్పత్రులకు తరలించాల్సి వస్తోంది.

# ఆర్టీసీ బస్సులో మంటలు



ఆగస్టు 20 (సందేశం టైమ్స్)ఆర్టీసీ బస్సులో మంటలు చెలరేగిన సంఘటన కర్నూలు జిల్లాలో చోటుచేసుకుంది. ఆదోని డిపోకు చెందిన సింగిల్ స్టాప్ బస్సు ఉదయం కర్నూలు బయల్దేరింది. గోనెగండ్ల ఎస్సీ కాలనీకి చేరుకున్న సమయంలో డ్రైవర్ దగ్గర బ్యానెట్ నుంచి మంటలు చెలరేగాయి. అప్రమత్తమైన డ్రైవర్ తిప్పన్న బస్సును నిలిపివేసి, ప్రయాణికులను దించేశారు. దీంతో పెనుప్రమాదం తప్పింది.

# ఉసురు తీసిన సరదా



కనిగిరి, ఆగస్టు 20 (సందేశం టైమ్స్) ఇద్దరు స్నేహితుల సరదా వారి ప్రాణాలను బలి తీసుకుంది. రెండు కుటుంబాలకు కడుపు కోతను మిగిల్చింది. ఈ ఘటన కనిగిరి మండలంలోని పునుగోడు వద్ద వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కనిగిరిలోని నక్కలతిప్ప ప్రాంతానికి చెందిన బొందలపాటి శివ ప్రసాద్ (19), శంఖవరం గ్రామానికి చెందిన ఏనుగంటి ఎర్రయ్య (18) స్నేహితులు. వీరి రువురూ స్థానిక ప్రైవేటు కళాశాలలో ఇంటర్ చదువుతున్నారు. సీఎస్‌పురంలోని భైరవకోన జలపాతాన్ని చూసేందుకు వెళుతున్నామంటూ ఉదయం శివప్రసాద్ వాళ్ల నాయనమ్మకు చెప్పి బైక్‌పై వెళ్లారు. కానీ స్నేహితులకు మాత్రం ఈత కొట్టేందుకు వెళ్తున్నామని తెలిపారు. మధ్యా హ్నం పునుగోడు చెరువులో శవాలై తేలారు.భైరవకోనకు అని బయల్దేరిన శివప్రసాద్, ఎర్రయ్య పునుగోడు గ్రామంలోని చెరువు వద్దకు వెళ్లారు.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# నీళ్లతో మద్యం కల్తీ



**నిందితులు, మద్యం బాటిళ్లతో ఎక్సైజ్ శాఖ అధికారులు**
**బ్రాండ్ మార్చి ఇతర బ్రాందీ సీసాల్లో నింపి బెల్ట్ షాపులకు అమ్ముతున్న అన్నదమ్ముల అరెస్ట్**
**%180 ఎంఎల్ మద్యం క్వార్టర్ బాటిల్‌లో 40 ఎంఎల్ నీళ్లు**

జంగారెడ్డిగూడెంఆగస్టు 20 (సందేశం టైమ్స్)తక్కువ ధరకు దొరికే మద్యాన్ని తాగే పేద, మధ్య తరగతికి చెందిన మందు బాబులను మోసం చేస్తూ నీళ్లు కలిపిన మద్యం, బ్రాండ్ మార్చిన మద్యాన్ని ఒరిజినల్ మద్యం మాదిరిగా బెల్ట్ షాపుల వద్ద అమ్ముతున్న ఇద్దరు అన్నదమ్ములను ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా జంగారెడ్డిగూడెం ఎక్సైజ్ స్టేషన్‌లో ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరిండెంటెంట్ సీహెచ్. అజయ్‌కుమార్ సింగ్ విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ బోయపాటి శ్రీలత, అసిస్టెంట్ కమిషనర్ కేవీఎన్. ప్రభుకుమార్ ఆదేశాలతో దాడులు నిర్వహించినట్టు తెలిపారు. కల్తీ చేసిన మద్యాన్ని ద్విచక్ర వాహనంపై తరలిస్తున్నారని వచ్చిన సమాచారంతో జంగారెడ్డిగూడెం మండలం పుట్లగట్లగూడెం గ్రామం సమీపంలో ఉదయం దాడులు నిర్వహించామన్నారు. ఈ దాడిలో మండలంలోని వేగవరం గ్రామానికి చెందిన నూతి మధు ద్విచక్ర వాహనంపై మద్యం తరలిస్తూ ఉండగా అరెస్టు చేశామన్నారు. అతడిని విచారించిన అనంతరం వేగవరంలోని అతడి ఇంటివద్ద దాడులు నిర్వహించామన్నారు. అక్కడ అతడి తమ్ముడు నూతి సాయిరాంతో పాటు మద్యం సీసాలు, మద్యం కల్తీ చేయడానికి ఉపయోగించే ఖాళీ సీసాలు, మూతలు, తదితర వస్తువులను స్వాధీనం చేసుకున్నామన్నారు.రెండు రకాల మద్యం బాటిళ్ల ధరలు ఇలా..

మద్యం దుకాణాలు లేని గ్రామాల్లో బెల్ట్ షాపుల వద్ద రూ.99 ధర ఉన్న '99' బ్రాండ్ మద్యాన్ని నూట ఇరవై రూపాయలకు, ఇదే 99 బ్రాండ్ మద్యంతో ఓఏబీ క్వార్టర్ బాటిళ్లలో నింపిన బాటిళ్లను రూ.150కు అమ్ముతున్నారు. మద్యం దుకాణాల్లో ఓఏబీ క్వార్టర్ ధర రూ.130. ఈ రెండు బ్రాండ్ లు రాడికో కంపెనీ తయారు చేసినవే కావ డంతో పెద్దగా తేడా తెలియవని నిందితులు ఈ బ్రాండ్‌లు ఎంచుకున్నట్టు తెలిపారు. వీరిద్దరితో పాటు రాడికో కంపెనీ లేబిల్‌ను బాటిల్ మూతలపై ముద్రించి అక్రమానికి పాల్పడిన విజయవాడ వన్‌టౌన్‌కు చెందిన ముత్తా మనోజ్‌కుమార్ అనే గుజరాత్‌కు చెందిన వ్యాపారిపై కేసులు నమోదు చేశామని తెలిపారు.

ఫ నిందితులైన మధు, సాయిరాం తండ్రి రామకృష్ణపై గతంలో నాటు సారా కేసులు న్నాయని తెలిపారు. మూతలు సప్లై చేసిన వ్యాపారి ముత్తా మనోజ్‌కుమార్‌పై కూడా గతంలో నరసాపురంలో నకిలీ మూతల సరఫరా చేసినందుకు కేసులున్నట్టు తెలిపారు.

ఈ దాడిలో నిందితుల నుంచి 219 మద్యం సీసాలు, 19,500 ఓఏబీ బ్రాండ్‌తో ఉన్న బాటిల్ మూతలు, 622 ఖాళీ ఓఏబీ క్వార్టర్ బాటిల్స్, 370 తీసివేసిన బాటిల్ మూతలు, ఒక స్కూటీ వాహనం, బాటిళ్లకు సీల్ వేసే బొంత సూది స్వాధీనం చేసుకున్నారు. దాడుల్లో స్థానిక ఎక్సైజ్ స్టేషన్ సీఐ కె.శ్రీనుబాబు, ఎన్‌ఫోర్స్ మెంట్ సీఐ వైవీఎన్ఎస్. ఫణికు మార్, స్టేషన్ ఎస్ఐ సుబ్రహ్మణ్యం, సిబ్బంది పాల్గొన్నారు.

కల్తీ చేసిన విధానం ఇలా..

వేగవరం గ్రామానికి చెందిన నూతి మధుకు గతంలో బ్రాందీ షాపులో పనిచేసిన అనుభవం ఉంది. ఆ అనుభవంతో తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలు సంపా దించాలని, తమ్ముడు నూతి సాయిరాం సహకారంతో మద్యం దుకాణాల వద్ద '99' అనే బ్రాండ్‌కు చెందిన మద్యం క్వార్టర్ బాటిళ్లను అధిక మొత్తంలో కొనుగోలు చేసేవారు. 180 ఎంఎల్ మద్యంతో ఉన్న క్వార్టర్ బాటిల్‌లో సుమారు 40 ఎంఎల్ మద్యాన్ని ఒక పాత్రలోకి వేరు చేస్తారు. ఆ తరువాత ఖాళీ చేసిన మద్యం స్థానంలో నీళ్లతో నింపి వారి దగ్గర ఉన్న బొంత సూదితో అనుమానం రాకుండా తిరిగి సీల్ చేస్తారు. ఆ తర్వాత ఇతర దుకాణాలలో సేకరించిన ఓల్డ్ అడ్మిరల్ బ్రాందీ (ఓఏబీ) ఖాళీ క్వార్టర్ బాటిళ్లలో 99 బ్రాండ్ క్వార్టర్ బాటిళ్ల నుంచి వేరు చేసిన మద్యాన్ని నింపి విజయవాడ నుంచి తెప్పించిన నకిలీ క్వార్టర్ బాటిళ్ల మూతలతో సీల్ చేస్తారు. ఈ రెండు రకాల మద్యం బాటిళ్లను మద్యం దుకాణాలు లేని గ్రామాల్లో అక్రమ మద్యం వ్యాపారం చేసే వారికి , పలు బెల్ట్‌షాపుల వద్ద అధిక ధరలకు విక్రయిస్తున్నారు.

## వీధి కుక్కలతో ప్రజలు బెంబేలు



పర్చూరు/కారంచేడు, ఆగస్టు 20 (సందేశం టైమ్స్) వీధి శునకాలతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. ఎటు నుంచి శునకాలు మూకుమ్మడిగా దాడులకు పాల్పడతాయోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పర్చూరు, కారంచేడు మండలాల పరిధిలో ఏ గ్రామంలో చూసిన వీధికుక్కలు గుంపులు గుంపులుగా వందల సంఖ్యలో దర్శనమిస్తున్నాయి. ప్రధాన వీధులు, రహదారుల్లో గుంపులు గుంపులుగా సంచరిస్తూ ఆయా మార్గాలలో రాకపోకలు సాగించే వారిపై మూకుమ్మడిగా దాడులకు పాల్పడుతున్నాయి. రాత్రి సమయాల్లో రోడ్లపైకి రావాలంటే ప్రజలు వాహన దారులు భయపడుతున్నారు. ఎటు నుంచి వీధి శునకం తనపై దాడిచేస్తుందోనని ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకొని మరీ రాకపోకలు సాగిస్తునారంటే పరిస్థితి ఎలా ఉందో ఇట్టే అర్థం చేసుకోవచ్చు. ఆయా మండలాల పరిధిలో గడిచిన నెల రోజుల్లో 40 మందికి పైగా ప్రజలు వీధి కుక్కల దాడిలో గాయపడ్డారంటే పరిస్థితి ఎంత తీవ్రతరంగా ఉందో ఇట్టే అర్థం చేసుకోవచ్చు. గత ఏడాది పర్చూరుకు చెందిన ఓ వ్యక్తి వీధి శునకం దాడిలో గాయపడి రేబీస్ వ్యాధితో మృతి చెందిన ఘటన కూడా ఉంది. దీంతో వీధి శునకాల దాడిలో తమ ప్రాణాలకు ముప్పు ఉందని ప్రజలు భయపడుతున్నారు.

## ఎరువుల దుకాణాలు తనిఖీ



చాపాడు, ఆగస్టు 20 (సందేశం టైమ్స్) మండల కేంద్రమైన చాపాడులోని ఎరువుల దుకాణాలను మైదుకూరు ఏడీఏ క్రిష్ణమూర్తి, ఏవో పద్మలత మంగళవారం తనిఖీ చేశారు. దుకాణాల్లోని రికార్డులను క్రిష్ణమూర్తి పరిశీలించారు. డీలర్లు రసాయనిక ఎరువులను రైతులకు ఎక్కువ రేటుకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. రైతులకు అవసరం ఉన్నన్ని రసాయనిక ఎరువుల బస్తాలు అందుబాటులో ఉంచినట్లు ఆయన చెప్పారు. రైతులు యూరియాను వరిపైరు సాగుకు ఎక్కువగా ఉపయోగించవద్దని అవసరాన్ని బట్టి పైరు పెరుగుదలకు రైతులు రసాయనిక ఎరువులను పలు దపాలుగా ఉపయోగించాలన్నారు.

## రైలు బ్రిడ్జికి ఎత్తుకు సమీపానికి నీరు



– తాడేపల్లి ఆగస్టు 20 (సందేశం టైమ్స్)ప్రకాశం బ్యారేజీ వద్ద ఉదయం నుండి గంట గంటకు వరద ఉధృతి పెరుగుతోంది. ఎగువ నుండి బ్యారేజీ వద్దకు 4 లక్షల 81 వేల 194 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుండగా 4 లక్షల 85 వేల 539 క్యూసెక్కులను దిగువకు సముద్రంలోకి విడుదల చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. మొదటి ప్రమాద హెచ్చరిక కొనసాగుతుండగా రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేసే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు. సీతానగరం పుష్కర గట్ల వద్ద పర్యాటకులు వెళ్లకుండా ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. రైలు బ్రిడ్జి వంతెనను తాకేంత స్థాక్ష్మిఇలో నీరు పోటెత్తుతోంది. 13.5 అడుగుల వద్ద బ్యారేజీ నీటి మట్టముంది. నదీ పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విపత్తు నిర్వహణ శాఖ, రెవెన్యూ, పోలీస్ శాఖ అధికారులు కోరారు.

## బిక్కుబిక్కుమంటూ సురక్షిత ప్రాంతాలకు లంకల వాసులు



తుళ్లూరు ఆగస్టు 20 (సందేశం టైమ్స్)కృష్ణానదికి వరద హెచ్చరికల నేపథ్యంలో లంక గ్రామాలు బిక్కుబిక్కుమంటున్నాయి. రాత్రికి కృష్ణానదికి 5 లక్షల క్యూసెక్కుల నీరు చేరుతుందన్న ప్రచారంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు. వరద ప్రమాదం దష్ట్యా అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. తుళ్లూరు తహశీల్దార్ హరిబాబు, సిఐ శ్రీనివాసరావు రాయపూడి లంకకు వెళ్లి రక్షణ చర్యలపై అవగాహన కల్పించారు. రాయపూడి లంకలో సుమారు 140 కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. వీరిని సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని అధికారులు సూచించడంతో పడవల్లో సురక్షిత ప్రాంతాలకు తరలివెళుతున్నారు. ఉద్ధండరాయునిపాలెం, తాళ్లాయపాలెం, వెంకటపాలెం లంకల్లో నివాసం ఉంటున్న వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు.

## కౌల్దార్లకు పంట రుణాలు, పెట్టుబడి సాయ్యుం ఇవ్వాలి



యడ్లపాడు :ఆగస్టు 20 (సందేశం టైమ్స్) ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు భూయజమాని అనుమతితో సంబంధం లేకుండా గ్రామ సభల ద్వారా కౌల్దార్లకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, అన్నదాత సుఖీభవనూ వర్తింపజేయాలని కౌలురైతు సంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి వై.రాధాకృష్ణ డిమాండ్ చేశారు. కౌలురైతుల సమస్యలపై ఈనెల 25న చలో కలెక్టరేట్ నిర్వహించనున్న నేపథ్యంలో మండలంలోని జగ్గాపురం, జాలాది, సందెపూడి, తుర్లపాడు, కారుచోల, వంకాయలపాడు, ఉన్నవ, యడ్లపాడు, మైదవోలు, లింగారావుపాలెం, సొలస తదితర గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ మాట్లాడుతూ కౌల్దార్లకు అన్ని సచివాలయాల వద్ద దరఖాస్తులను అందుబాటులో ఉంచాలని, స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం రూ.2 లక్షల వరకు వడ్డీలేని పంట రుణాలివ్వాలని కోరారు.

## సంక్షేమ హాస్టళ్లలో సిపిఎం పరిశీలన



అమరావతి ఆగస్టు 20 (సందేశం టైమ్స్) ధరణికోటలోని ఎస్సీ, బీసీ బాలుర హాస్టళ్లను సిపిఎం నాయకులు సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఆహారము, తాగునీరు, విద్యార్థులుండే గదులు, మరుగుదొడ్లను పరిశీలించారు. బలవర్ధకమైన ఆహారాన్ని అందించాలని వార్డెన్‌ను సిపిఎం మండల కార్యదర్శి బి.సూరిబాబు కోరారు. వానల నేపథ్యంలో సీజనల్ వ్యాధులు రాకుండా ముందస్తుగా వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని ఎఎన్ఎంను కోరారు. హాస్టల్లో బ్లీచింగ్, హాస్టల్లో చుట్టుపక్కల మురుగు కాల్వల్లో దోమలు వృద్ధి చెందకుండా చూడాలని పంచాయతీ కార్యదర్శిని కోరారు. దురలవాట్లకు లోనవకుండా శ్రద్ధగా చదవాలని, పరిశుభ్రంగా ఉండాలని విద్యార్థులకు సూచించారు.

# అద్దె గర్భం దందా.. ఆ లింకులపై ఆరా..



హైదరాబాద్ సిటీ ఆగస్టు 20 (సందేశం టైమ్స్): ఇటీవల పేట్‌బషీరాబాద్‌లో వెలుగులోకి వచ్చి సంచలనం సృష్టించిన అద్దె గర్భం కేసులో సైబరాబాద్ పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. కొంతకాలంగా గుట్టుగా దందా నిర్వహిస్తున్న ప్రధాన నిందితురాలు లక్ష్మీరెడ్డి అలియాస్ లక్ష్మి, ఆమె కొడుకు నరేందర్‌రెడ్డిని పోలీసులు ఇటీవల అరెస్టు చేసిన విషయం తెలిసిందే. కేసు దర్యాప్తులో విస్తుపోయే విషయాలు వెలుగులోకి వచ్చినట్లు తెలిసింది. చిలుకలూరిపేటకు చెందిన నరెడ్డుల లక్ష్మీరెడ్డి అలియాస్ లక్ష్మి(45) కొంతకాలంగా సరోగసి ద్వారా పిల్లలను కని ఇవ్వడం, అండాలను విక్రయించి డబ్బులు సంపాదించే దందాను నిర్వహిస్తోంది. 2024లో ముంబై పోలీసులు చిన్నారుల విక్రయం, అక్రమ రవాణా కేసులో ఆమెను అరెస్టు చేసి జైలుకు పంపారు. ఈ కేసు వివరాలను తెప్పించుకొని పరిశీలించిన సైబరాబాద్ పోలీసులు.. ఆ ముఠాతో లక్ష్మీరెడ్డికి ఎంతకాలంగా సంబంధాలు ఉన్నాయి..? ఎంతమంది చిన్నారులను అక్రమ రవాణా చేసింది..? నగరంలో ఎంతమంది ఆమె నెట్‌వర్క్‌లో ఉన్నారు..? ఏఏ రాష్ట్రాలకు చెందిన చైల్డ్ ట్రాఫికింగ్ ముఠాలతో సంబంధాలున్నాయి అనే కోణంలో పోలీసులు విచారిస్తున్నారు. లక్ష్మి నెట్‌వర్క్‌లో ఉన్న కొంతమంది అనుచరులను పోలీసులు గుర్తించినట్లు తెలిసింది. ముంబై జైలు నుంచి విడుదలైన లక్ష్మీరెడ్డి తన దందాను నగరంలో విస్తరించాలని నిర్ణయించుకుంది. ఈ క్రమంలో మాదాపూర్, అమీర్‌పేట, ఆర్టీసీ క్రాస్‌రోడ్ తదితర ప్రాంతాల్లో ఉన్న ఫర్టిలిటీ సెంటర్స్‌ను ఆశ్రయించింది. అండాలు కావాలన్నా, అద్దె గర్భానికి (సరోగసి) మహిళలు కావాలన్నా తాను ఏర్పాటు చేస్తానని ఒప్పందం చేసుకుంది. భర్త నుంచి విడిపోయిన ఆమె తన దందాకు కొడుకు, కుమార్తెను ప్రధాన ఏజెంట్లుగా నియమించుకుంది. ఏపీ సహా ఇతర రాష్ట్రాల నుంచి బతుకుదెరువు కోసం నగరానికి వచ్చిన ఒంటరి మహిళలను టార్గెట్ చేసుకుని వారు అండాలను ఇవ్వడానికి ఇష్టపడితే రూ. 10వేలు, అద్దె గర్భం కోసం ఒప్పుకునే మహిళలకు రూ. 4లక్షలు చెల్లిస్తానని ఒప్పందం చేసుకునేది. బిడ్డను కని ఇచ్చిన తర్వాత పిల్లలు లేని దంపతుల నుంచి రూ. 20-30లక్షలు తీసుకుని ఫర్టిలిటీ సెంటర్ యజమానులు, లక్ష్మీరెడ్డి సమంగా పంచుకునేవారని పోలీసులు గుర్తించినట్లు సమాచారం.

# ఉధృతంగానే మూసీ



యాదాద్రి, ఆగస్టు 20 (సందేశం టైమ్స్) జిల్లాలో మోస్తరుతోపాటు చిరుజల్లులతో కూడి న వర్షాలు కురుస్తున్నాయి. సగటున 11.0మి.మీ వర్షపాతం నమోదైంది. అత్యధికంగా రాజపేటలో 17.6 మి.మీ, పో చంపల్లిలో 17.3మి.మీ వర్షం కురిసింది. జిల్లాలో వారం రోజులుగా కురుస్తున్న వ ర్షాలకు భువనగిరి, బీబీనగర్, వలిగొండ మం డలాల్లోని పలు గ్రామాల్లో వరితోపాటు పత్తి చేలల్లోకి నీరుచేరింది. జిల్లావ్యాప్తంగా సుమా రు 200 ఎకరాల్లో పంటలు నీట మునిగాయి. వర్షాలకు తొమ్మిది ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నా యి. బీబీనగర్ మండలం మగ్దుంపల్లిలో 120 మీటర్ల వరకు మిషన్‌భగీరథ పైపులైన్ కొట్టుకుపోయింది. జిల్లా వ్యాప్తంగా 54 ఆవాసాల కు తాగునీటి సరఫరా నిలిచింది. దీంతో అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నారు. హైదరాబాద్ నగరంలో కురుస్తున్న భారీ వ ర్షాలకు మూసీ ఉధృతంగా ప్రవహిస్తోంది. వ లిగొండ మండలం సంగెం-బొల్లెపల్లి, బీబీనగ ర్ మండలం రుద్రవల్లి-జూలురు లోలెవల్ బ్రిడ్జీల పైనుంచి నాలుగు అడుగుల ఎత్తులో మూసీ పరవళ్లు తొక్కుతోంది. దీంతో రాకపోకలు నిలిచిపోయాయి. మూసీ వరద పెరిగే అవకాశం ఉన్నందున రెవెన్యూ, పోలీస్ యం త్రాంగం అప్రమత్తమైంది. భారీ వర్షాల నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాల్లో చెరువులు, వాగుల్లోకి చేపల వేటకు వెళ్లకూడదని అధికారులు హెచ్చరించారు. వ్యవసాయ పొలాలకు వెళ్లే రైతులు కూడా వాగుల ఉధృతిని బట్టి వెళ్లాలని సూచిస్తున్నారు. ఎగువన కురుస్తున్న భారీ వర్షాలకు జిల్లాలోని చెరువులు, కుంటలు అలుగు పారుతున్నాయి. హైదరాబాద్‌తోపాటు నగరశివారు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తుండటం, హిమాయత్‌సాగర్, ఉస్మాన్‌సాగర్ నుంచి ది గువకు నీటిని విడుదల చేయడంతో మూసీ పరవళ్లు తొక్కుతోంది.

# కల్తీసారా తాగిన వారి వీసాలు రద్దు




ఆగస్టు 20 (సందేశం టైమ్స్)మద్య నిషేధం అమలులో ఉన్న కువైత్‌లో కల్తీ సారా కలకలం కొనసాగుతోంది. ఈ ఘటనను తీవ్రంగా పరిగణించిన కువైత్ ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటోంది. ఈ దుర్ఘటన అనంతరం భారతీయులు, ఇతర విదేశీ కార్మికులు నివసిస్తున్న ప్రాంతాల్లో పోలీసులు రేయింబవళ్లు తనిఖీలు చేస్తున్నారు. వీసా, ఇంటి చిరునామాలో ఎలాంటి లొసుగులు కనిపించినా అరెస్టు చేసి జైలుకు తరలిస్తున్నారు. దీంతో ఇక్కడ ప్రవాసాంధ్రులు బిక్కుబిక్కుమంటూ బతుకుతున్నారు. కల్తీ సారాతోపాటు వ్యభిచారం, ఇతర నేరాలకు నెలవైన జ్లీబ్ అల్ శూయుఖ్ అనే ప్రాంతాన్ని పూర్తిగా నేలమట్టం చేసి, దాన్ని పునర్నిర్మించే ప్రతిపాదనను కూడా కువైత్ ప్రభుత్వం పరిశీస్తోంది. 8 చదరపు కిలోమీటర్ల వైశాల్యంలో ఉన్న ఈ ప్రాంతం అనేక నేరాలకు అడ్డాగా మారింది. ఇక్కడ ప్రవాసాంధ్ర కార్మికులు, ఇతర భారతీయులు, బంగ్లాదేశీయులు నివసిస్తున్నారు. కల్తీ సారా సేవించి ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న భారతీయులతో సహా విదేశీయులందరూ కోలుకున్న అనంతరం వారందరి వీసాలు రద్దు చేసి దేశ బహిష్కరణ విధించడంతో పాటు వారు జీవితంలో మళ్లీ తమదేశంలో అడుగు పెట్టకుండా నిషే?ధించాలని కువైత్ ప్రభుత్వం నిర్ణయించింది. ఇస్లామిక్ చట్టం అమలులో ఉన్న కువైత్‌లో సారా విక్రయం, వినియోగం నిషేధం. దీన్ని ఉల్లంఘించినందుకు ఈ చర్యలు తీసుకోవాలని నిర్ణయించినట్టు కువైత్ అధికారులు ప్రకటించారు. కల్తీ సారా తాగిన వారిలో 40 మంది భారతీయులు సహా మొత్తం 160 మంది వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు.

# మున్నేరులో పడి యువకుడు గల్లంతు



మధిర, ఆగస్టు 20 (సందేశం టైమ్స్):మున్నేరులో చేపల వేటకు వెళ్లిన ఓ యువకుడు అందులో పడి గల్లంతైన సంఘటన మధిర శివాలయం సమీపంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మధిర మున్సిపాలిటీ పరిధిలోని మడుపల్లికి చెందిన పెసరవెల్లి వినోద్ (34) మధిర శివాలయం సమీపంలో గల చెక్ డ్యామ్ వద్దకు చేపల వేటకు వెళ్లాడు. ఉధృతంగా ప్రవహిస్తున్న మున్నేరు చెక్ డ్యామ్ వద్ద ప్రమాదవశాత్తు పడిపోయాడు. విషయాన్ని స్థానిక టౌన్ పోలీసులకు, ఫైర్ స్టేషన్ అధికారులకు తెలిపారు. అక్కడకు చేరుకున్న పోలీస్, ఫైర్ సిబ్బంది గల్లంతయిన యువకుడు కోసం గాలింపు చర్యలు చేపట్టారు. అయినప్పటికీ ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో ప్రత్యేక బృందాన్ని తీసుకువచ్చి గాలింపు చర్యలు చేపడతామని తాసీల్దార్ రాంబాబు తెలిపారు.

# పోలీస్ స్టేషన్ ముందు వ్యక్తి ఆత్మహత్యాయత్నం



కారేపల్లి,ఆగస్టు 20 (సందేశం టైమ్స్):అప్పుకు డబ్బులు తీసుకున్న వ్యక్తి తిరిగి చెల్లించకపోవడం పెద్ద మనుషుల్లో పెట్టినా సరైన న్యాయం జరగలేదని మనస్థాపంతో వ్యక్తి పోలీస్ స్టేషన్‌కు వచ్చి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. ఈ ఘటన కారేపల్లి పోలీస్ స్టేషన్ ముందు చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. కారేపల్లి క్రాస్‌రోడ్‌కు చెందిన పాలెపు భద్రం అదే గ్రామానికి చెందిన ఉపేందర్‌కు రూ.5 లక్షలు అప్పు ఇచ్చాడు. తిరిగి చెల్లించమని కోరుతున్నా ఉపేందర్ పెడచెవిన పెడుతున్నాడు. ఈ విషయమై పెద్దమనుషుల ముందు పంచాయతీ పెట్టినా సరైన న్యాయం జరగలేదని భద్రం మనస్థాపం చెందాడు. కారేపల్లి క్రాస్ రోడ్‌లో ఇద్దరి మధ్య వాగ్వివాదం జరిగింది. దీంతో భద్రం బైక్‌పై కారేపల్లి పోలీస్ స్టేషన్‌కు వచ్చి అక్కడే గడ్డి మందు తాగాడు. విషయాన్ని చూచిన పోలీసులు అతడిని కారేపల్లి పీహెచ్‌సీకి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం 108 ద్వారా ఖమ్మం ఆస్పత్రికి తరలించారు. ఈ విషయమై ఎస్ఐ బి.గోపి మాట్లాడుతూ భద్రం స్టేషన్‌లో ఎలాంటి ఫిర్యాదు ఇవ్వలేదన్నారు. అతను ఇదే మొదటిసారి స్టేషన్ రావడం అని తెలిపారు. ఈ విషయమై విచారిస్తున్నట్లు పేర్కొన్నారు.

# యూరియా నిల్.. క్యూలైన్లు ఫుల్




మహబూబాబాద్, ఆగస్టు 20 (సందేశం టైమ్స్) హనుమకొండ సబర్బన్: యూరియా కొరత రైతన్నకు చుక్కలు చూపిస్తున్నది. సాగు పనులు మానుకొని తెల్లవారుజాము నుంచి ఎరువుల కోసం పడిగాపులు కాసినా ఒక్క బస్తా కూడా దొరకడం గగనం అవుతోంది. అలాగే మహబూబాబాద్ జిల్లాకు 40,500 మెట్రిక్ టన్నులు అవసరమైతే ఇప్పటివరకు 18,100 మెట్రిక్ టన్నులు మాత్రమే వచ్చింది. అలాగే హనుమకొండ జిల్లాకు గతేడాది 29,174 మెట్రిక్ టన్నుల యూరియా వస్తే.. ఈసారి ఇప్పటివరకు కేవలం 16,943 మెట్రిక్ టన్నులే వచ్చిందంటే కొరత ఏస్థాయిలో ఉందో స్పష్టమవుతున్నది.

%గతంలో మాదిరిగా బఫర్ నిల్వలు లేకపోవడంతో చేతులెత్తేసిన అధికారులు.. 'సొసైటీకి స్టాక్ వచ్చినప్పుడే ఇస్తాం' అన్నట్లు వ్యవహరించడం అన్నదాతల్లో ఆగ్రహావేశాలు తెప్పిస్తున్నది. సరిపడా యూరియా ఇవ్వాలంటూ కోసం రోడ్డెక్కి ఆందోళన చేస్తూ కాంగ్రెస్ సర్కారు వైఫల్యంపై దుమ్మెత్తిపోస్తున్నారు. అయితే వారం క్రితం ఉమ్మడి జిల్లాకు రావాల్సిన యూరియా వ్యాగన్ వరుస సెలవుల కారణంగా ఇప్పటివరకు రాకపోగా అధికారుల సోమవారం రాత్రి వస్తుందంటున్నా గ్యారంటీ అయితే లేదు. మానుకోట జిల్లాకు 40,500 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం కాగా, ఇప్పటివరకు 18,100 మెట్రిక్ టన్నులు మాత్రమే వచ్చింది. దీంతో యూరియా కటకట తీవ్రంగా నెలకొంది ఒక ఆగస్టు నెలలోనే యూరియా రైతులకు 15వేల మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉంటుం ది. ఈ నెలలో ఇప్పటివరకు కేవలం 4,850 మెట్రిక్ టన్నులు మాత్రమే వచ్చింది. మహబూబాబాద్ జిల్లాకేంద్రంతో పాటు 18 మండలాల్లో యూరియా నిల్వలు లేకుండా పోయాయి. ఐదారు రోజులకు వచ్చే అరకొర యూరియాతో వేలాది మంది రైతులకు పంపిణీ చేయడమూ సిబ్బందికి కష్టంగా మారింది.

# కేబుల్ వైర్లు సరిచేయకుంటే తొలగింపే..
# ఎన్పీడీసీఎల్ సీఎండీ వార్నింగ్



ముకరంపుర, ఆగస్టు 20 (సందేశం టైమ్స్) విద్యుత్ స్తంభాలకు అస్తవ్యస్తంగా ఉన్న కేబుల్ వైర్లను నిర్వాహకులు నిర్దేశించిన విధంగా సరిచేసుకోనట్లయితే తొలగించాలని ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి ఎస్ఈలను ఆదేశించారు. హన్మకొండలోని విద్యుత్ భవన్ నుంచి అన్ని సర్కిళ్ల ఎస్ఈలు, డీఈలు, డీఈ(టెక్నికల్)లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. విద్యుత్ స్తంభాలకు అస్తవ్యస్తంగా వేలాడుతూ ప్రమాదాలకు కారణమవుతున్న కేబుల్ వైర్లను నిర్వాహకులు సరిచేయకుంటే తొలగించాలన్నారు. వినాయక చవితి, దుర్గామాత నవరాత్రోత్సవాల సందర్భంగా తయారీ కేంద్రాల నుంచి మండపాలకు ఎత్తయిన విగ్రహాల తరలింపు, నిమజ్జన శోభాయాత్రలో ఇబ్బందులు లేకుండా లైన్ల క్లియరెన్స్ చేపట్టి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా వినాయక నిమజ్జన రూట్లను ముందస్తుగా తనిఖీ చేసి క్లియరెన్స్ ఉండేలా ఇప్పటి నుంచే తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. వినాయక మండపాల నిర్వాహకులకు విద్యుత్ విషయంలో జాగ్రత్తలు తీసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. క్షేత్ర స్థాయిలో సమష్టిగా సమన్వయంతో పనిచేస్తూ ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు.




# క్రీడావార్తలు




# గిల్ వచ్చేశాడు వైస్ కెప్టెన్‌గా ఎంపిక

అనేక ఊహాగానాల మధ్య ఎట్టకేలకు ఆసియాకప్ టీ20 టోర్నీలో పాల్గొనే భారత జట్టును ప్రకటించారు. ఇటీవలి టెస్టు సిరీసలో అదరగొట్టిన శుభ్‌మన్ గిల్ పొట్టి ఫార్మాట్‌లో పునరాగమనం చేయనున్నాడు. ఇక పరిమిత ఓవర్ల ఫార్మాట్‌లో విశేషంగా రాణిస్తున్నప్పటికీ.. శ్రేయాస్ అయ్యర్‌ను పట్టించుకోకపోవడం ఫ్యాన్స్‌ను నిరుత్సాహపరిచింది. అలాగే ఫామ్‌లో ఉన్న జైస్వాల్‌ను స్టాండ్‌బైగా ఎంపిక చేయగా.. ఐపీఎల్‌లో ఆకట్టుకోలేకపోయిన రింకూ సింగ్, హర్షిత్‌లను మాత్రం జట్టులోకి తీసుకోవడం గమనార్హం.ముంబై: ఏడాది తర్వాత శుభ్‌మన్ గిల్ భారత టీ20 జట్టులో చోటు దక్కించుకున్నాడు. వచ్చే నెల 9 నుంచి యూఏఈలో జరిగే ఆసియాకప్ టోర్నీ కోసం మంగళవారం సెలెక్టర్లు 15 మందితో కూడిన జట్టును ప్రకటించారు. సూర్యకుమార్ యాదవ్ సారథ్యంలో భారత్ బరిలోకి దిగనుండగా.. అతడికి డిప్యూటీగానూ గిల్ వ్యవహరించనున్నాడు. గతంలో అక్షర్ ఈ బాధ్యతలు నిర్వర్తించాడు. స్టార్ పేసర్ బుమ్రా సైతం జట్టులోకి రావడంతో పేస్ బలం రెట్టింపు కానుంది. అయితే ఐపీఎల్‌తో పాటు ఏడాది కాలంగా ఈ ఫార్మాట్‌లో విశేషంగా రాణిస్తున్న శ్రేయాస్ అయ్యర్‌కు సెలెక్టర్లు మొండిచేయి చూపారు. ఇక 25 ఏళ్ల గిల్ చివరి టీ20 మ్యాచ్‌ను గతేడాది జులై 30న శ్రీలంకపై ఆడాడు. ఆ తర్వాత బంగ్లాదేశ్, దక్షిణాఫ్రికా,




ఇంగ్లండ్‌లతో జరిగిన టీ20 సిరీస్‌లకు అతన్ని ఎంపిక చేయలేదు. ఇక ఇంగ్లండ్‌తో ఇటీవలి టెస్టు సిరీసలో గిల్ అంచనాలకు మించి రాణించడం చూశాం. జైస్వాల్ సైతం పోటీలో ఉన్నా గిల్ వైపే మొగ్గు చూపారు. అయితే గిల్ రాకతో జట్టు ఓపెనర్ల సంఖ్య అభిషేక్, శాంసన్‌లతో కలిపి మూడుకు చేరింది. దీంతో అభిషేక్‌కు జతగా గిల్‌ను ఆడించి శాంసన్‌ను మిడిలార్డర్‌కు మార్చే అవకాశం ఉంది. అటు జట్టు దుబాయ్ చేరాక ప్రత్యర్థి జట్టు బలాలు, పరిస్థితులను గమనించి గిల్‌ను ఎక్కడ ఆడించాలనేది నిర్ణయం తీసుకుంటారని అగార్కర్ తెలిపాడు. బ్యాటింగ్ విభాగంలో హార్దిక్, తిలక్ వర్మ, శివమ్ దూబేలతో పాటు ఐపీఎల్‌లో ఇబ్బందిపడిన హిట్టర్ రింకూ సింగ్ చోటు దక్కించుకున్నాడు. బ్యాకప్ కీపర్‌గా జితేశ్ శర్మపై సెలెక్టర్లు నమ్మకముంచారు. ధ్రువ్ జురెల్ పేరును కూడా పరిగణనలోకి తీసుకున్నా అతడిని స్టాండ్‌బైగా ఎంపిక చేశారు. ఆర్‌సీబీ తరఫున జితేశ్ మెరుపు ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్న విషయం తెలిసిందే.ఐపీఎల్‌లో వరుసగా రెండుసార్లు సారథిగా తన జట్ల (కోల్‌కతా, పంజాబ్)ను ఫైనల్‌కు చేర్చడంతో పాటు బ్యాటింగ్‌లోనూ శ్రేయాస్ అయ్యర్ ఆకట్టుకున్నాడు. ఈ ఏడాది సీజన్‌లో 175 స్ట్రయిక్ రేట్‌తో 604 పరుగులు సాధించాడు. అటు చాంపియన్స్ ట్రోఫీలోనూ కీలక పాత్ర పోషించాడు. అలాగే ఫార్మాట్ ఏదైనా చెలరేగి గతేడాది సయ్యద్ ముస్తాక్ అలీ, రంజీ, ఇరానీ ట్రోఫీల్లోనూ ముంబై జట్టును విజేతగా నిలిపాడు. అయినా టీ20 జట్టులో శ్రేయాసకు చోటు దక్కకపోవడంతో సెలెక్టర్లపై ఫ్యాన్స్ గుర్రుగా ఉన్నారు. కనీసం స్టాండ్‌బై ఆటగాడిగానూ పనికిరాడా? అని విమర్శిస్తున్నారు. అయితే వీటికి సమాధానంగా అన్నట్టు అజిత్ అగార్కర్ స్పందించాడు. 'ఆసియాక్‌పనకు శ్రేయాస్ ఎంపిక కాకపోవడం దురదృష్టకరం. ఇందులో అతడి తప్పు లేదు.. మా తప్పు లేదు. ఎందుకంటే శ్రేయాస్‌ను ఎవరి స్థానంలో తీసుకోవాలో చెప్పండి? జట్టులో అత్యంత పోటీ వాతావరణం ఉంది. అందుకే తను మరికొంత కాలం వేచిచూడాల్సిందే' అని అగార్కర్ తేల్చాడు.బుమ్రా రాకతో..: ఆసియాకప్ తర్వాత విండీసతో టెస్టు సిరీస్ ఉండడంతో స్టార్ పేసర్ బుమ్రా ప్రాతినిధ్యంపై సందేహాలు నెలకొన్నాయి. ఎందుకంటే సెప్టెంబరు 28న ఫైనల్ జరుగనుండగా.. అక్టోబరు 2 నుంచే టెస్టు ఆరంభమవుతుంది. అయితే పెద్ద టోర్నీల్లో బుమ్రా ఆడితేనే బావుంటుందనే ఆలోచనతో సెలెక్టర్లు అతడిని ఎంపిక చేశారు. దీంతో టీ20 ప్రపంచకప్ తర్వాత బుమ్రా ఈ ఫార్మాట్‌లో ఆడబోతున్నాడు. ఏదిఏమైనా బుమ్రా రాకతో భారత బౌలింగ్ మరింత పటిష్టం కానుంది.

# ప్రపంచకప్ జట్టులో శ్రీచరణి

ముంబై: ఇంగ్లండ్ టూర్‌లో ఆకట్టుకొన్న తెలుగమ్మాయి శ్రీచరణికి జాక్‌పాట్ తగిలింది. మంగళవారం ప్రకటించిన మహిళల వన్డే వరల్డ్ కప్ జట్టులో ఆమెకు చోటుదక్కింది. ఫిట్‌నెస్ సాధించిన పేసర్ రేణుక సింగ్ జట్టులోకి పునరాగమనం చేసింది. టాపార్డర్‌లో ప్రతికా రావల్‌కు చాన్స్ దక్కగా.. షఫాలీకి సెలెక్టర్లు మొండిచేయి చూపారు. కెప్టెన్‌గా హర్మన్‌ప్రీత్ కౌర్, వైస్ కెప్టెన్‌గా స్మృతి మంధాన వ్యవహరించనున్నారు. భారత్, శ్రీలంకల్లో వచ్చే నెల 30 నుంచి వరల్డ్‌కప్ జరగనుంది. కాగా ఇటీవలే ఇంగ్లండ్‌తో జరిగిన ఐదు టీ20 మ్యాచ్‌ల సిరీసలో 10 వికెట్లు పడగొట్టిన కడప జిల్లాకు చెందిన శ్రీచరణి ప్లేయర్ ఆఫ్ ది సిరీసగానూ ఎంపికైంది. కాగా, మెగా టోర్నీకి ముందు.. అంటే సెప్టెంబరు 14 నుంచి ఆస్ట్రేలియాతో జరిగే మూడువన్డేల సిరీస్ కోసం కూడా భారత జట్టును సెలెక్టర్లు ప్రకటించారు. ఇంగ్లండ్ పర్యటనలో ఆడిన జట్టును దాదాపుగా ప్రపంచక్‌పనకు ఎంపిక చేశారు. ఒక్క మార్పు మినహా విశ్వకప్




జట్టునే ఈ సిరీసకూ ఖరారు చేశారు. ఆల్‌రౌండర్ అమన్‌జోత్ కౌర్ స్థానంలో ఆసీస్‌తో వన్డేలకు సయాలీ సత్‌ఘరేను తీసుకొన్నారు. గాయంతో బాధపడుతున్న అమన్‌జోత్ సెంటర్ ఫర్ ఎక్సలెన్స్‌లో పునరావాసంలో ఉంది. ప్రపంచకప్ సమయానికి ఆమె కోలుకొనే అవకాశం ఉంది. యువ సీమర్ క్రాంతి గౌడ్, అరుంధతిలకు కూడా టీమ్‌లో చోటు లభించింది. శ్రీచరణితోపాటు దీప్తి శర్మ, రాధా యాదవ్, స్నేహ్ రాణాలతో స్పిన్ విభాగం బలంగా కనిపిస్తోంది.

# సెమీస్‌లో స్వియటెక్ జోడీ




న్యూయార్క్: యుఎస్ ఓపెన్ మిక్స్‌డ్ డబుల్స్ చాంపియన్‌షిపలో స్వియటెక్, డిఫెండింగ్ చాంప్ సారా ఎరాని జంటలు సెమీస్ చేరుకొన్నాయి. క్వార్టర్స్‌లో స్వియటెక్ - కాస్పర్ రూడ్ ద్వయం 4-1, 4-2తో కేటీ మెక్‌నెల్లీ-ముసెట్టి జంటపై గెలిచింది. తొలిరౌండ్‌లో కీన్-టియాఫోపై స్వియటెక్ జోడీ గెలిచింది. క్వార్టర్స్‌లో ఎరాని-వవస్సోరి జంట 4-1, 5-4(4)తో ముచోవా-రుబ్లేవ్‌పై నెగ్గింది. మొదటి రౌండ్‌లో రిబకినా-ఫ్రిట్జ్‌పై 4-2, 4-2తో ఎరాని జంట నెగ్గింది. కాగా, వీనస్ విలియమ్స్-రిల్లీ ఒపెల్కా 2-4, 4-5(2)తో ముచోవా-రుబ్లేవ్ ద్వయం చేతిలో, ఒసాక-మోన్‌ఫిల్స్ జోడీ 3-5, 2-4తో కేటీ-ముసెట్టి జంట చేతిలో తొలి రౌండ్‌లోనే ఓడారు.

# 2025: కేశవ్ పాంచ్





%కెయిన్స్: ఆస్ట్రేలియా పర్యటనలో మూడు వన్డేల సిరీస్‌ను దక్షిణాఫ్రికా ఘనంగా బోణీ చేసింది. మంగళవారం జరిగిన మొదటి మ్యాచ్‌లో లెఫ్టామ్ స్పిన్నర్ కేశవ్ మహారాజ్ (5/33) కెరీర్ బెస్ట్ గణాంకాలు నమోదు చేయడంతో సఫారీ జట్టు 98 పరుగుల తేడాతో ఆతిథ్య ఆసీసకు షాకిచ్చింది. తొలుత దక్షిణాఫ్రికా.. ఓపెనర్ మార్‌క్రమ్ (82), కెప్టెన్ బవుమా (65), మాథ్యూ బ్రెజెకె (57) అర్ధ సెంచరీలతో 50 ఓవర్లలో 8 వికెట్లకు 296 పరుగులు చేసింది. హెడ్ 4, డ్వార్షుయిస్ 2 వికెట్లు తీశారు. ఛేదనలో సఫారీ బౌలర్లు కేశవ్‌కు తోడు ఎంగిడి (2/28), బర్గర్ (2/54) ధాటికి ఆసీస్ 40.5 ఓవర్లలో 198 పరుగులకే కుప్పకూలింది. సారథి మిచెల్ మార్ష్ (88) ఒంటరి పోరాటం చేశాడు. ఐదు వికెట్లతో అదరగొట్టిన కేశవ్‌కు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కింది.

# రష్మికకు స్వర్ణం మనుకు కాంస్యం




షిమ్‌కెంట్ (కజకిస్థాన్): భారత స్టార్ షూటర్ మను భాకర్ ఆసియా చాంపియన్‌షిపలో పతకం సాధించింది. సీనియర్ విభాగం మహిళల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ వ్యక్తిగత ఈవెంట్ ఫైనల్స్‌లో 219.7 పాయింట్లు స్కోరు చేసిన మను.. మూడోస్థానంలో నిలిచి కాంస్యం అందుకుంది. ఇక, ఎయిర్ పిస్టల్ టీమ్ ఈవెంట్‌లో పాలక్, సురుచి సింగ్‌లతో కలిసి మను భాకర్ కాంస్యం నెగ్గి రెండో పతకం ఖాతాలో వేసుకుంది. అలాగే జూనియర్ బాలికల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ వ్యక్తిగత ఈవెంట్‌లో భారత అమ్మాయి రష్మి సాగల్ స్వర్ణం కొల్లగొట్టింది. ఇదే విభాగం టీమ్ ఈవెంట్‌లోనూ రష్మిక.. వంశిక, మోహినిలతో కలిసి పసిడి నెగ్గి గోల్డెన్ డబుల్ సాధించింది. కాగా, యూత్ మహిళల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ వ్యక్తిగత విభాగంలో కనక్ స్వర్ణం, ఆగమ్ గ్రేవాల్ రజతం నెగ్గారు. ఇక, టీమ్ ఈవెంట్‌లో భారత జట్టు పసిడి సాధించింది. జూనియర్ బాలుర ఎయిర్ పిస్టల్‌లో గవిన్ కాంస్యం అందుకోగా.. యూత్ పురుషుల ఎయిర్ పిస్టల్‌లో గిరీష్ స్వర్ణం, దేవ్ ప్రతాప్ కాంస్యం గెలిచారు. ఇక, యూత్ పురుషుల టీమ్ ఈవెంట్‌లోనూ భారత జట్టు పసిడి సాధించడం విశేషం.

# కింగ్స్‌పై బుల్స్ గెలుపు




: ఏపీఎల్‌లో భాగంగా మంగళవారం ఇక్కడ జరిగిన తొలి మ్యాచ్‌లో భీమవరం బుల్స్ 27 పరుగుల తేడాతో కాకినాడ కింగ్స్ ను ఓడించింది. తొలుత బ్యాటింగ్ చేసిన బుల్స్ 20 ఓవర్లలో 6 వికెట్లకు 214 పరుగులు చేసింది. సాయిశ్రవణ్ (58 పరుగులు), రేవంత్‌రెడ్డి (51) అర్ధ సెంచరీలు సాధించారు. కింగ్స్ బౌలర్లలో సుదర్శన్, మణికంఠకు చెరి రెండు వికెట్లు దక్కాయి. ఛేదనలో కాకినాడ 19.5 ఓవర్లలో 187 రన్స్‌కే ఆలౌటైంది. కేఎస్ భరత్ (76) కెప్టెన్స్ ఇన్నింగ్స్ ఆడినా ఫలితం దక్కలేదు. బుల్స్ బౌలర్లలో శివ, సత్యనారాయణ రాజు, మనీష్‌కు రెండేసి వికెట్లు దక్కాయి. మరో మ్యాచ్‌లో రాయల్స్ ఆఫ్ రాయలసీమ (161/5)పై అమరావతి రాయల్స్ (17.3 ఓవర్లలో 163/3) గెలిచింది.

# బిజినెస్



## చైనా, పాకిస్తాన్ మాత్రమే కాదు.. మన దగ్గర కూడా భారీగా గోల్డ్ నిల్వలు

మన దేశంలో బంగారం అంటే జనాలకు ఎంత ఇష్టమో అందరికీ తెలిసిందే. పెళ్లిళ్లు, పండగలు, పూజలు సహా ఏ కార్యక్రమం అయినా కూడా బంగారం లేకుండా జరగదు. కానీ, మనం ఏటా 700-800 టన్నుల బంగారాన్ని ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నాం. మన దగ్గర సొంతంగా ఉత్పత్తి అయ్యేది కేవలం 1.6 టన్నులు మాత్రమే (2020 లెక్కల ప్రకారం). ఇప్పుడు ఒడిశా ) నుంచి ఒక గుడ్ న్యూస్ వచ్చింది. అక్కడ కొత్తగా బంగారు నిల్వలు కనుగొన్నారు. ఇది మన దేశ ఖనిజ సంపద, ఆర్థిక వ్యవస్థకు శుభపరిణామమని చెప్పవచ్చు.జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా ఒడిశాలోని పలు జిల్లాల్లో బంగారు నిల్వలను గుర్తించింది. దేవగఢ్‌లోని అడసా-రాంపల్లి ప్రాంతంతో పాటు సుందర్‌గఢ్, నబరంగ్‌పూర్, కియోంఝర్, అంగుల్, కోరాపుట్ జిల్లాల్లో బంగారం ఉన్నట్టు నిర్ధారణ అయింది. అంతేకాదు, మయూర్ భంజ్, మల్కాన్‌గిరి, సంబల్‌పూర్, బౌద్ జిల్లాల్లో కూడా ప్రాథమిక అన్వేషణ జరుగుతోంది. ఖనిజ శాఖ మంత్రి బిభూతి భూషణ్ జెనా ఈ విషయాన్ని రాష్ట్ర అసెంబ్లీలో ప్రకటించారు.అధికారిక లెక్కలు ఇంకా బయటకు రాలేదు. కానీ జియోలాజికల్ అంచనా ప్రకారం ఒడిశాలో 10-20 మెట్రిక్ టన్నుల బంగారం (రూ. 20,363.39 కోట్ల విలువైన) ఉండొచ్చు. ఇది మన దిగుమతులతో పోలిస్తే తక్కువే అయినా, భారత్‌లో




సొంత ఉత్పత్తి పెంచడానికి ఇది ఒక మంచి విషయం.ఒడిశా ఇప్పటికే క్రోమైట్, బాక్సైట్, ఇనుప ఖనిజాలకు ప్రసిద్ధి. ఇప్పుడు బంగారం కూడా వెలుగులోకి రావడంతో రాష్ట్ర ఖనిజ సంపద మరింత పెరుగుతుంది. ఈ కొత్త బంగారు నిల్వలు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను బూస్ట్ చేయడమే కాకుండా, స్థానికంగా ఉద్యోగాలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి, వ్యాపార అవకాశాలను కూడా పెంచుతుంది. నేపథ్యంలో దేవగఢ్‌లో మొదటి బంగారు గని బ్లాక్‌ను వేలం వేయడానికి ఒడిశా మైనింగ్ కార్పొరేషన్ సిద్ధమవుతున్నాయి. ఈ గనుల వాణిజ్య సామర్థ్యాన్ని అంచనా వేయడానికి అన్వేషణ స్థాయి నుంచి అధునాతన సాంపిలింగ్, డ్రిల్లింగ్ దశలకు చేరుకుంది.

## వారి మాటలు నమ్మి మోసపోవద్దు.. చందా దారులకు అలర్ట్..




%ఇటీవల కాలంలో మనీ మోసాలు ఎక్కువయ్యాయి. ఈ క్రమంలో పలువురు దుండగులు పీఎఫ్ సభ్యులను కూడా వదలడం లేదు. మీ మనీ విత్ డ్రా చేయిస్తామని చెప్పి చీట్ చేస్తున్నారు. దీంతోపాటు పలు కన్సల్టెంట్లు కూడా తప్పుడు సమాచారం ఇచ్చి మోసం చేయడానికి ప్రయత్నిస్తున్నాయి. వీటి గురించి తెలిసిన .. పీఎఫ్ సభ్యులకు కీలక సూచనలు జారీ చేసింది. అలాంటి వాళ్ల మాటలు నమ్మి మీ కష్టార్జితాన్ని కోల్పోవద్దని సూచించింది.ఈ క్రమంలో కన్సల్టెంట్ల మాటలు నమ్మొద్దని %జూఖీూ% స్పష్టం చేసింది. కొందరు ఖాతా నుంచి డబ్బు తీసుకోవడానికి సహాయం చేస్తామని, త్వరగా డబ్బు వస్తుందని హామీ ఇస్తారు. కానీ, అలాంటి మాటల వెనుక మోసం ఉ ంటుందని ప్రస్తావించారు. మీరు నమ్మితే, మీ డబ్బు కోల్పోయే ప్రమాదం ఉందని హెచ్చరించింది. అందుకే, అధికారిక వెబ్‌సైట్ లేదా ఆఫీస్ ద్వారా మాత్రమే సేవలు పొందాలని తెలిపింది. %జూఖీూ% చందాదారుల క్లెయిమ్ ప్రక్రియ ఇప్పుడు చాలా సులభతరం అయింది. గతంలో అడ్వాన్స్ క్లెయిమ్‌ల కోసం రూ. 1 లక్ష వరకు మాత్రమే ఆటో-సెటిల్‌మెంట్ సౌకర్యం ఉ ండేది. కానీ ఇప్పుడు ఈ పరిమితిని రూ. 5 లక్షలకు పెంచారు. అంటే, మీకు అత్యవసరంగా డబ్బు అవసరమైతే, ఎక్కువ మొత్తం కూడా పొందవచ్చు.ఆటో-సెటిల్‌మెంట్ సౌకర్యం మొదట కోవిడ్-19 సమయంలో ప్రవేశపెట్టారు. అప్పటి నుంచి దీన్ని అనారోగ్యం, విద్య, వివాహం, హౌసింగ్ వంటి అడ్వాన్స్ క్లెయిమ్‌లకు విస్తరించారు. ఈ క్లెయిమ్‌లు ఆటోమేటిక్‌గా ప్రాసెస్ అవుతాయి. అంటే మనుషుల జోక్యం లేకుండా, పారదర్శకంగా త్వరగా డబ్బు మీ ఖాతాలో జమ అవుతుంది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో %జూఖీూ% ఏకంగా 2.34 కోట్ల అడ్వాన్స్ క్లెయిమ్‌లను ఆటో సెటిల్ చేసింది. ఇది గత ఏడాదితో పోలిస్తే 161% ఎక్కువ. ఈ సంవత్సరం మొదటి రెండున్నర నెలల్లోనే 76.52 లక్షల క్లెయిమ్‌లు సెటిల్ అయ్యాయి, అంటే దాదాపు 70% క్లెయిమ్‌లు ఆటో మోడ్‌లో పూర్తయ్యాయి. ఇప్పుడు రూ.5 లక్షల పరిమితితో, మరిన్ని క్లెయిమ్‌లు ఈ సౌకర్యం కిందకు వస్తాయి. దీనివల్ల మీ క్లెయిమ్ మూడు రోజుల్లోనే ప్రాసెస్ అవుతుంది.

## ట్రంప్ సుంకాల ఎఫెక్ట్.. రూ.4.19 లక్షల కోట్ల విలువైన భారత వస్తువులపై ప్రభావం..




అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన కొత్త సుంకాల కారణంగా భారతదేశ ఎగుమతులపై తీవ్ర ప్రభావం చూపనుంది. ఇది ప్రధానంగా మన దేశ వ్యాపారులకు, ఎగుమతిదారులకు చాలా దెబ్బ అని చెప్పవచ్చు. ఈ సుంకాల వల్ల సుమారు %వి%48.2 బిలియన్ విలువైన భారత వస్తువులు ప్రభావితం కాబోతున్నాయని కామర్స్ మంత్రిత్వ శాఖ తాజాగా అంచనా వేసింది. %అంటే దాదాపు రూ. 4.19 లక్షల కోట్ల విలువైన ఎగుమతులు . ఇది చిన్న విషయం కాదు. చాలా పెద్ద మొత్తమని చెప్పవచ్చు. అయితే ప్రధానంగా ఏ రంగాలపై ప్రభావం ఉంటుంది, ఏంటనే విషయాలను ఇక్కడ తెలుసుకుందాం.మీరు షాపింగ్‌కి వెళ్లినప్పుడు ఒక షర్టు కొనాలనుకుంటే, దానికి ట్యాక్స్ కట్టాలి. అలాగే, ఒక దేశం నుంచి మరో దేశానికి వస్తువులు ఎగుమతి చేస్తే, ఆ వస్తువులపై సుంకం (టారిఫ్) విధిస్తారు. అమెరికా ఇప్పుడు భారతదేశం నుంచి వచ్చే కొన్ని వస్తువులపై 25% సుంకాన్ని ఆగస్టు 7 నుంచి విధించింది. కానీ ఆగస్టు 27 నుంచి మరో 25% సుంకం కూడా యాడ్ చేయనుంది. అంటే, మొత్తం 50% సుంకం. ఇది భారత ఎగుమతులపై తీవ్ర ప్రభావం చూపిస్తుంది.

## రెండో రోజూ లాభాలే.. ఈ రోజు టాప్ ఫైవ్ స్టాక్స్ ఇవే..



గత వారం భారీ నష్టాలను చవిచూసిన దేశీయ సూచీలు ఈ వారంలో మాత్రం లాభాల జోష్‌లో సాగుతున్నాయి. జీఎస్టీలో సంస్కరణలు, భారత్‌పై ఆంక్షల విషయంలో డొనాల్డ్ ట్రంప్ కాస్త నెమ్మదించడం, ఉ క్రెయిన్-రష్యా యుద్ధం ముగింపు విషయంలో గుడ్ న్యూస్ వచ్చే అవకాశం ఉందన్న వార్తలు వస్తుండడంతో మదుపర్లు కొనుగోళ్లకు మొగ్గుచూపారు. అంతర్జాతీయంగా సానుకూలాంశాలు కూడా కలిసి రావడంతో సెన్సెక్స్, నిఫ్టీ వరుసగా రెండో లాభాలను ఆర్జించాయి
సోమవారం ముగింపు (81, 273)తో పోల్చుకుంటే మంగళవారం ఉదయం స్వల్ప లాభాలతో మొదలైన సెన్సెక్స్ రోజంతా లాభాల్లోనే కదలాడింది. ఒక దశలో దాదాపు 500 పాయింట్లు లాభపడి 81,755 వద్ద ఇంట్రాడే గరిష్టానికి చేరుకుంది. చివరకు సెన్సెక్స్ 370 పాయింట్ల లాభంతో 81, 644 వద్ద రోజును ముగించింది. మరో వైపు నిఫ్టీ కూడా సెన్సెక్స్ బాటలోనే కదలాడింది. చివరకు 103 పాయింట్ల లాభంతో 24, 980 వద్ద స్థిరపడింది. సెన్సెక్స్‌లో మదర్సన్, ఐఐఎఫ్ఎల్, పేటీఎమ్, ఎక్సైడ్ ఇండస్ట్రీస్, బంధన్ బ్యాంక్ షేర్లు లాభాలను ఆర్జించాయి. భారత్ డైనమిక్స్, కల్యాణ్ జువెల్లర్స్, సోలార్ ఇండస్ట్రీస్, క్యామ్స్, రెడ్డీస్ ల్యాబ్స్ షేర్లు నష్టాల బాటలో నడిచాయి. నిఫ్టీ మిడ్ క్యాప్ ఇండెక్స్ 551 పాయింట్లు లాభపడింది. బ్యాంక్ నిఫ్టీ 130 పాయింట్లు ఆర్జించింది. డాలర్‌తో పోల్చుకుంటే రూపాయి మారకం విలువ 86.95గా ఉంది.

## పాత ఫోన్ పడేస్తున్నారా. .ఫ్రీగా వచ్చే బంగారాన్ని మిస్ అయినట్లే..!

మీ పాత మొబైల్ ఫోన్ లేదా కంప్యూటర్‌ని చూస్తే, ఇది ఇప్పుడు వేస్ట్ అని పడేయాలనిపిస్తుందా. కానీ ఒక్కసారి ఆగండి. ఎందుకంటే ఆ పాత వాటి నుంచి ఇప్పుడు బంగారం తీస్తున్నారు. అవును, మీరు విన్నది నిజమే. శాస్త్రవేత్తలు గోల్డ్ కోసం ఒక అద్భుతమైన, పర్యావరణ హితమైన మార్గాన్ని కనిపెట్టారు. దీంతో మన పాత ఎలక్ట్రానిక్ వస్తువుల నుంచి బంగారం తీసి, పర్యావరణానికి మేలు చేయనున్నారు. ఈ సరికొత్త ఆవిష్కరణ గురించి ఓ జర్నల్ ప్రకటించింది. ఆ విశేషాలేంటో ఇక్కడ తెలుసుకుందాం.మనం రోజూ స్మార్ట్‌ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, టీవీలు.. ఇలా ఎన్నో ఎలక్ట్రానిక్ గాడ్జెట్‌లు వినియోగిస్తున్నాం. కొత్త టెక్నాలజీ వస్తుంటే, పాతవి పడేస్తున్నాం. దీనివల్ల ఏం జరుగుతుంది? ఎలక్ట్రానిక్ వేస్ట్ (ఈ-వేస్ట్) పేరుకుపోతోంది. 2024 రిపోర్ట్ ప్రకారం, 2022లో ప్రపంచవ్యాప్తంగా 6.2 కోట్ల టన్నుల ఈ-వేస్ట్ ఉత్పత్తి అయింది. ఇది 2010తో పోలిస్తే 82% ఎక్కువ. ఇంకా షాకింగ్ విషయం ఏంటంటే, 2030 నాటికి ఈ సంఖ్య 8.2




కోట్ల టన్నులకు చేరనుంది. ఇంత ఈ-వేస్ట్‌ని ఒక చోట పేర్చితే, భూమి చుట్టూ 40 టన్నుల ట్రక్కులు 1.55 మిలియన్ల క్యూ కడతాయి.అయితే ఈ వేస్ట్ కేవలం చెత్త మాత్రమే కాదు. దీనిలో బంగారం, వెండి, రేర్ ఎర్త్ ఎలిమెంట్స్ లాంటి విలువైన వనరులు కూడా ఉన్నాయి. కానీ ప్రపంచంలో కేవలం 1% రేర్ ఎర్త్ ఎలిమెంట్స్ మాత్రమే రీసైక్లింగ్ ద్వారా తిరిగి వస్తున్నాయి. మిగిలినవి? వేస్ట్‌గా పోతున్నాయి. అంతేకాదు, సాంప్రదాయ బంగారం తీసే పద్ధతులు పర్యావరణానికి హాని చేస్తాయి, రిస్క్‌తో కూడుకున్నవి. ఇక్కడే ఈ కొత్త ఆవిష్కరణ వెలుగులోకి వచ్చింది.

TGTEL/25/A0348 TITLE: Sandhesham Times 3-82,Ananthagiri, Singavaram, SURYAPET, Telangana,508 206 Gmail : sandeshamtimes@gmail.com Website:https://sandeshamtimes.com Publisher Press (Name & Address) SUNDAY PRINTING PRESS 3-4297,SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR, ANDHRA PRADHESH-522 006